ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025 | 5

శాంతించినది

ధవళేశ్వరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద తగ్గుముఖం పడుతుంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం సాయంత్రానికి 3,28,230 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 5 వేలు, సెంట్రల్ డెల్టాకు 2300, పశ్చిమడెల్టాకు 7 వేల క్యూసెక్కులు చొప్పున నీరు విడుదల చేశారు.

బడులకు.. మంచిరోజులు

- ఇక రాజకీయ జోక్యం చెల్లు
- ఇతర వ్యక్తులకు అనుమతి నిల్
- విద్యార్థులతో ఫొటోలు నిషేధం
- పేరెంట్స్, ఎస్ఎంసీలకు ఓకే
- ఏదైనా హెచ్ఎంకు చెప్పాల్సిందే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
పాఠశాలలకు మంచిరోజులు వచ్చాయి. పాఠశాలలో రాజకీయ జోక్యాలను నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆహ్వానిస్తున్నారు. ఏదో కారణంతో బయట నుంచి అనేక మంది వ్యక్తులు పాఠశాలల్లోకి ప్రవేశించి గొడవలు పడడం వంటివి జరుగుతున్న సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో విద్యాశాఖ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వి. విజయ రామరాజు ఈ నెల 1న పాఠశాల విద్యా జాయింట్ డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులకు కొన్ని ప్రొసీడింగ్స్ ఇచ్చారు.వాటి ప్రకారం ఇక పాఠశాలలోకి తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు తప్ప అనధికార వ్యక్తులకు పాఠశాల ఆవరణలోకి ప్రవేశం లేదు.హెచ్ఎం అనుమతి లేకుండా ఎవరూ వెళ్లకూడదు. బహుమతులు,విరాళాలు ఇవ్వడానికి అనుమతి తీసుకోవాల్సిందే. పాఠశాలల్లో కొనసాగుతున్న విద్య కార్యకలాపాలకు అంతరాయం కలిగించే పరిస్థితి లేకుండా ఈ ఉత్తర్వులు కట్టడి చేయనున్నాయి. పిల్లలకు ఏదైనా గిఫ్టులు, సామగ్రిని అందజేయాలంటే నేరుగా హెచ్ఎంకు సమర్పించాలి. విద్యార్థితో మాట్లాడకూడదు. తరగతి గదుల్లోకి వెళ్లకూడదు.పిల్లలతో అక్కడ ఫొటోలు తీసుకోవడం నిషేధించారు. ఏ రకమైన పిర్యాది అయినా, అభ్యర్థన అయినా అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందికి మాత్రమే అందజేయాలి. ఇతర వ్యక్తులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదు. పాఠశాలల ప్రాంగణంలో రాజకీయ పార్టీలు, సంస్థలకు సంబంధించిన జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు వంటివి, రాజకీయ చిహ్నాలు ప్రదర్శించడాన్ని నిషేధించారు. ఇక విద్యార్థి సంఘాలు ఏదైనా సమస్య ఉంటే నేరుగా హెడ్‌మాస్టర్‌తో మాట్లాడాలి. నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి, విద్యార్థులతో మాట్లాడడం, ఉపన్యాసాలు ఇవ్వడం వంటి వాటికి ఇక అనుమతి ఉండదు. ఈ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేసేలా ఆయా జిల్లాలకు ఆదేశాలందాయి.



టీచర్ల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వ విద్య చతికిలపడుతుందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ప్యాప్టో) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జేడీఐజీ డేనియల్ బాబు, పి.జయకర్ అన్నారు. రాజమహేంద్రవరం(బొమ్మూరు)లోని కలెక్టరేట్ ఎదుట శనివారం ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు.ఇటీవల పాఠశాలల్లో ప్రవేశపెట్టిన విద్యాశక్తి కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరిస్తున్నాయన్నారు.



ఆదివారం ప్రత్యేకం

ఒక ఊరు.. నూరు లాడ్జిలు!

పిఠాపురాన ప్రతి ఇల్లూ వసతిగృహామే

ఆ ఆలయానికి వెళితే వసతికి వెతుక్కోవాల్సిన పనే ఉండదు.. ఆలయం ఎదుట నిలబడి ఎటు చూసినా రూమ్స్ అద్దెకు ఇవ్వబడును అంటూ బోర్డులు దర్శనమిస్తాయి.. ఎందుకంటే అక్కడ ప్రతి ఇల్లూ ఒక అతిథి గృహమే.. ఈ నేపథ్యంలో ఏ ఇంటి తలుపు తట్టినా అతిథిదేవోభవ అంటూ ఆహ్వానిస్తారు.. అదిరే సౌకర్యాలతో ఆతిథ్యం ఇస్తారు.. ఫ్రీగా అనుకునేరు.. అంతా డబ్బులకే.. ఇదెక్కడో కాదండోయ్.. పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభుడి ఆలయం చుట్టూ ఉన్న పరిస్థితి.. ఒక 100 వరకూ లాడ్జిలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో.. ఇక్కడ కాశీ తరహాలో వసతి సదుపాయాలు ఉంటాయి..

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)
అక్కడ ప్రతి ఇల్లు ఒక వసతి గృహమే. వీధులు, సందులు ఎక్కడ చూసినా 'రూమ్‌లు అద్దెకు ఇవ్వబడును' అంటూ ఇంగ్లీషు, హిందీ, మరాఠీ భాషల్లో బోర్డులు కనిపిస్తాయి. శ్రీపాదుడి ఆలయానికి చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఇప్పటికే 100కిపైగా లాడ్జిలు ఉన్నాయి. మరో 50 వరకూ నిర్మాణంలో ఉన్నాయి. భక్తులకు గదులు అద్దెకు ఇవ్వడం ద్వారా పలువురు ఉపాధి పొందుతున్నారు.కాశీ తరహాలో ఒక ఆలయం చుట్టూ ఇన్ని వసతి సముదాయాలు ఉన్న పరిస్థితి గోదావరి జిల్లాల్లో ఎక్కడా కానరాదు.

శ్రీపాదశ్రీవల్లభుడి భక్తుల రాక..

మరాఠీలు, ఉత్తరాది రాష్ట్రాలు వారు తమ ఇంటి ఇలవేల్పుగా దత్తాత్రేయస్వామి ప్రథమ అవతారమైన శ్రీపాదశ్రీవల్లభుడిని భావిస్తారు. ఈ మేరకు ఆయన జన్మించిన పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి ఏటా 20 లక్షల మంది భక్తులు వస్తుంటారు. మహారాష్ట్రతో పాటు కర్నాటక, ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఉత్తరాది నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి శ్రీపాద శ్రీవల్లభుడిని దర్శించుకుంటారు.

ఇక్కడ కొబ్బరికాయ కొట్టరు..

శ్రీపాదశ్రీవల్లభుడికి కొబ్బరికాయ కొట్టరు. శ్రీపాదుడు కొలువై ఉన్న ఆలయ ప్రాంగణంలోని ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలను కట్టి వేలాడతీసి చుట్టూ ప్రదిక్షణలు చేసి కోర్కెలు నెరవేర్చమని వేడుకుంటారు.కోర్కెలు నెరవేరిన తర్వాత మళ్లీ శ్రీపాదశ్రీవల్లభుడిని దర్శించుకుని పూజలు చేస్తారు.

ఏటా గురువారాలు, చిత్తనక్షత్రం వచ్చే రోజులతో పాటు శ్రీపాద శ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు, దత్త జయంతి ఉత్సవాలు, విజయదశమి, ఇతర పర్వదినాల సమయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.ఈ ఆలయానికి వచ్చే భక్తులు కనిష్ఠంగా మూడు రోజులు, గరిష్ఠంగా తొమ్మిది రోజులు ఉంటారు. కొందరు ఏటా నెల రోజుల పాటు ఉండి శ్రీపాదశ్రీవల్లభ చరిత్ర, గురుచరిత్ర పారాయణ చేసుకుంటారు.

భక్తనివాసాలుగా..

భక్తుల రద్దీ దృష్ట్యా నివాస గృహాలు లాడ్జిలు, భక్తనివాస్‌లు, వసతి సముదాయాలుగా మారిపోయాయి. ఆలయ వసతి సముదాయాల్లో 70 గదులు ఉన్నాయి. ఇవి పూర్తిగా ఉచితమైనా భక్తుల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ఇప్పుడు ఈ క్షేత్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో 100కిపైగా లాడ్జిలు ఉన్నాయి. ఇవి గాక పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 15 వరకూ ఉన్నా పర్వదినాల సమయాల్లో రూమ్‌లు సరిపోని పరిస్థితి. సాధారణ రోజుల్లో 12 గంటలకు రూ.వెయ్యి, 24 గంటలకు రూ.1500 నుంచి రూ.2,500 వరకూ అద్దెగా వసూలు చేస్తున్నారు. పర్వదినాల సమయంలో మాత్రం 12 గంటల ప్రాతిపదికన అద్దె రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకూ ఉంటోంది. భక్తులు వసతిని ఆలయ పరిసరాల్లో ఉన్న గృహాల యజమానులు తమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పలువురు గృహాల యజమానులు వసతి తీసుకునే భక్తులకు ఇష్టమైన ఆహారాన్ని తయారు చేసి అందిస్తున్నారు. ఆహారంతో కలిసి అద్దెలు వసూలు చేస్తారు.

ఇరుకుగా వీధులు..

ఆలయ పరిసరాల్లో రోడ్లు ఇరుగ్గా ఉంటాయి. ఒక కారు వెళ్తే మరో వాహనం వచ్చేందుకు మార్గం ఉండదు. అటువంటి చోట 100కిపైగా లాడ్జిలు, వసతి సముదాయాలను నిర్మించారు. కొన్ని సందుల్లోకి ద్విచక్ర వాహనాలు మినహా ఆటోలు వెళ్లలేవు. కాశీ తరహాలో ఇక్కడ వీధులు కనిపిస్తాయి. అటువంటి వాతావరణం ఉభయ గోదావరి జిల్లాలోని పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం వద్ద కనిపిస్తోంది. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 1500 మందికి పైగా ఉపాధి

- ఏ వీధిలో చూసినా గెస్ట్‌రూమ్‌లు
- లాడ్జిలుగా మారుతున్న నివాసాలు
- ఏ ఇంటికెళ్లినా అద్దెకు రూమ్స్
- శ్రీ పాదుడి ఆలయం వద్ద డిమాండ్
- ఇప్పటికే 100 లాడ్జిలు నిర్వహణ
- నిర్మాణంలో మరో 150
- రోజురోజుకు పెరుగుతున్న భక్తులు
- 1500 మందికి ఉపాధి



కలుగుతోందని పలువురు తెలిపారు. ఇక్కడ వసతిగృహాలు, లాడ్జిలకు ఉన్న డిమాండ్‌తో స్థలాల రేట్లు గణనీయంగా పెరిగాయి. ఇక్కడ సెంటు స్థలం ప్రస్తుతం రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ఉంది.కొందరు సినీ ప్రముఖులు ఇక్కడ స్థలాలు కొనుగోలు చేశారు. వారు కొంత పెద్దస్థాయిలో హోటళ్ల నిర్మించాలని భావిస్తున్నట్టు సమాచారం.

భక్తులకు వసతి.. ఎందరికో ఉపాధి



శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి భక్తులు అధికంగా తరలివస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ పరిసరాల్లో గృహ యజమానులు తమ ఇళ్లనే వసతి సముదాయాలుగా మార్చి అద్దెకు ఇస్తున్నారు. భక్తులకు దగ్గరలో వసతి లభిస్తోంది.
-పెనుగొండ కొండలరావు, విశ్రాంత సాంఘిక సంక్షేమ శాఖాధికారి, పిఠాపురం

టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలి



పిఠాపురంను టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తే భక్తులకు మెరుగైన సౌకర్యాలు,వసతి లభిస్తాయి. ప్రభుత్వం పర్యాటకాభివృద్ధిలో భాగంగా హోమ్ స్టే కల్పిస్తున్న గృహ యజమానులను ప్రోత్సాహించాలి. డిప్యూటీ సీఎం పవన్ చొరవ చూపాలి.
- తోట ఏడుకొండలు, విశ్రాంత అర్బన్ బ్యాంకు ఉద్యోగి, పిఠాపురం



కొవ్వూరులో అన్నదాత సుఖీభవ చెక్ అందజేస్తున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే ముప్పిడి, కలెక్టర్

46 లక్షల మందికి అన్నదాత సుఖీభవ

కొవ్వూరులో ప్రారంభించిన మంత్రి నిమ్మల రామానాయుడు

కొవ్వూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 46 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ మొదటి విడత పెట్టుబడి సాయం అందించినట్టు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం నియోజకవర్గ అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ 2025-26 మొదటి విడత నిధుల జమ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయశాఖ నిర్వీర్యమైపోయిందన్నారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆరుగాలం పండించిన ధాన్యం అమ్మకాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సొమ్ములు సకాలంలో చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం రైతులకు బకాయిపడిన ధాన్యం సొమ్ము రూ.1640 కోట్లు చెల్లించిందన్నారు. అంతే కాదు ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతు ఖాతాకు సొమ్ము జమ చేస్తున్నామన్నారు.ప్రజాస్వామ్యంలో జగన్‌లాంటి వ్యక్తులు ఉండడానికి అనర్హులన్నారు. ఎవరైనా చనిపోతే వారం రోజుల్లో పరామర్శకు వెళ్తాం. జగన్‌రెడ్డి సంవత్సరం తరువాత పరామర్శకు వెళ్తారన్నారు. దేశచరిత్రలో బెట్టింగ్ రాయుళ్లకి, గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లకి విగ్రహావిష్కరణ చేసిన ఘనత ఒక జగన్మోహనరెడ్డికే చెల్లిందన్నారు. 2047కి తెలుగుజాతి ప్రపంచంలో అగ్రగామిగా ఉండాలని చంద్రబాబు, పవన్, నరేంద్ర మోదీ కృషిచేస్తుంటే మరోప్రక్కన అడుగడుగునా సమస్యలు సృష్టిస్తున్నారన్నారు.పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు మళ్లీ పట్టాలెక్కించారన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రమ్ వాల్, ప్రాజెక్టు పూర్తిచేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. చాగల్లు మండలంలో ఉన్న ముంపుగ్రామాల సమస్యను పరిష్కరిస్తానన్నారు. రాష్ట్రంలో 1050 ఎత్తిపోతల పథకాలు ఉంటే వాటిలో 540 పథకాలు పనిచేయడం లేదన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చి మరమ్మతులు చేసి నిర్వహించే బాధ్యతలు అప్పగించేలా రైతుల పక్షాన ప్రతిపాదనలు తయారుచేస్తున్నామన్నారు. సుమారు 6 వేల కోట్లతో ప్రతిపాదనలు వచ్చాయన్నారు. మంగళవారం సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుందామని సీఎం చెప్పారన్నారు. మరమ్మతులకు గురై మూతపడిన లిఫ్టులను పునః ప్రారంభిస్తామన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు గురయ్యాయని, గ్రామాలు ముంపుకు గురవుతున్నాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు.జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో మొదటి విడతగా రూ. 7 వేలు జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో లక్షా 14 వేల మందికి రూ.79 కోట్లు జమచేశారన్నారు. భూమిలేని కౌలు రైతులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. కౌలు రైతులకు అక్టోబర్, జనవరి నెలల్లో రూ. 20 వేలు జమ చేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు సత్యనారాయణను మార్గదర్శిగా ఎంపిక చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర,ఎంపీపీ కాకర్ల నారాయుడు, అదనపు ఎస్పీ సుబ్బరాజు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, సి.హెచ్.శ్రీనివాసరావు,ఎ.గంగాధర్,సూరపనేని చిన్ని, దాయ న రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియా శనివారం రైల్వే స్టేషన్లను పరిశీలించారు..ఈ నెల 6 లేదా 7న రైల్వే జీఎం రాక నేపథ్యంలో ముందస్తుగా తనిఖీలు సాగినట్టు తెలిసింది.. - వివరాలు 6లో

రైల్వే ప్రయాణికులకు అభద్రత!



రైల్వే స్టేషన్ ఆవరణలో మందుబాబు

- మందుబాబుల ఆగడాలు
- ఆభరణాలు దోచుకునే యత్నం
- పేలవంగా రక్షణ విధులు
- మరో పక్క డీఆర్ఎం తనిఖీలు

రాజమహేంద్రవరం,ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషను లోపల ఒక వైపు డీఆర్ఎం మోహిత్ సోనాకియా తనిఖీలు చేస్తుండగా.. స్టేషను బయట ఓ మహిళ మెడలో ఆభరణాలు దొంగిలించడానికి ఒక వ్యక్తి ప్రయత్నం చేశాడు. పెద్ద రైల్వే స్టేషన్ లోపలా బయటా నేరాలకు అడ్డాగా మారిందని 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం వెలువరించిన కథనం అక్షర సత్యమని ఈ ఘటన రుజువు చేస్తోంది. రైల్వే స్టేషనులో కోచ్ రెస్టారెంట్ ప్రాంతం, బయట రోడ్డుపై మద్యం పూటుగా తాగిన వ్యక్తులు ప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారు. వారిలో యాచకులు ఉంటున్నారు. వాళ్లను చూస్తేనే భయపడే విధంగా ఉంటున్నారు. వారం కిందట కోచ్ రెస్టారెంట్ ఎదురుగా మూతబడిన ఆహారం రెస్టారెంట్‌లో ఒక యాచకుడిపై దాడి జరిగిన విషయం తెలిసిందే. శుక్రవారం ఒక రైల్వే మహిళా ఉద్యోగి ఇంటికి వెళుతుండగా.. శ్రీరామ్ హోటల్ పక్కన ధ్వంసమైన షాపుల సమీపంలో పట్టపగలు ఆ ఉద్యోగి వెనుకగా వచ్చిన ఒక వ్యక్తి మెడలో ఆభరణాలు దొంగిలించే ప్రయత్నం చేశాడు. ఆమె అప్రమత్తమై ఆగ్రహించగా అతడు పారిపోయాడు. గూడ్‌షెడ్ ప్రాంతంలో గంజాయి దొరికిన దాఖలాలు ఉన్నాయి. రోజుకు 35 వేల మంది రాకపోకలు సాగించే రాజమండ్రి రైల్వే స్టేషనులో ప్రయాణికుల భద్రతను లోపల ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్), బయట టూటౌన్ పోలీసులు చూడాల్సిన బాధ్యత ఉంది.కానీ రక్షణ విధులు పేల వంగా మారినట్టు పరిస్థితులు చెబుతున్నాయి.టూటౌన్ పోలీసుల నిఘా లేకపోవడం, అప్పుడప్పుడు మాత్రమే పోలీసులు కనబడడంతో ప్రతి రోజూ పూటుగా మద్యం తాగిన వ్యక్తులు ప్రమాదకరంగా మారారు. ప్రయాణికులను భయపెడుతున్నారు.ఇక, రైల్వేస్టేషను బయట పరిశుభ్రత నిద్దరోయింది. ప్రయాణికులకు దుర్వాసన స్వాగతం పలుకుతోంది.

రెచ్చిపోతోన్న మట్టి మాఫియా



అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న లారీలను అడ్డుకున్న కలవచర్ల గ్రామస్తులు

- పోలవరం గట్లు మాయం
- కలవచర్ల గ్రామస్తుల ఆందోళన
- రంగంలోకి దిగిన అధికారులు
- 17 లారీలు..4 ఎక్స్‌కవేటర్లు సీజ్

రాజానగరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం మండలంలో మట్టి మాఫియా ఆగడాలు జోరుగా సాగుతున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారులు మాఫియా విసిరే కాసులకు కక్కుర్తి పడుతూ కనీసం కన్నెత్తి చూడడం లేదు. రాత్రి పగలు తేడా లేకుండా కాలువ గట్టు, చెరువుల్లో ప్రభుత్వ నిబంధనలను కాలరాస్తూ ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. రాజానగరం మండలం కలవచర్లలో పోలవరం కాలువ గట్టుపై యథేచ్ఛగా అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలు సాగుతున్నాయి. ఈ మేరకు గ్రామస్తులు శుక్రవారం అర్ధరాత్రి అడ్డుకుని సంఘటనా స్థలంలో ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో పోలవరం కాలువ గట్టుపై మట్టి లోడుతో ఉన్న 22 లారీలతో పాటు నాలుగు యంత్రాలను పట్టుకుని రెవెన్యూ, పోలీసులు అధికారులకు అప్పగించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ గ్రామంలో గత ఆరు నెలలుగా పోలవరం కాలువ గట్టుపై అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేస్తూ కోట్లాది రూపాయల అక్రమార్జన సాగిస్తున్నారన్నారు. అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఆందోళనకారులు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో రాజానగరం తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి కలవచర్ల చేరుకున్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న జేసీబీలు, లారీలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.దీంతో వివిధ శాఖల జిల్లా అధికారులు శనివారం కలవచర్ల చేరుకుని పోలవరం కాలువ గట్లను పరిశీలించారు. మైన్స్ శాఖ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి మాట్లాడుతూ మూడు ప్రదేశాల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరిపినట్టు గుర్తించామన్నారు. అక్రమ మట్టి రవాణా చేస్తున్న 17 టిప్పర్లను అదుపులోకి తీసుకుని రాజానగరం పోలీసులకు అప్పగించామన్నారు. పోలవరం కాలువ గట్టు వెంబడి మూడు ప్రదేశాల్లో తవ్వకాలు జరుపుతున్న నాలుగు ఎస్కవేటర్లను గుర్తించారు. ఇరిగేషన్ సిబ్బంది, మైనింగ్‌శాఖ సర్వేయర్ సహాయంతో అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాల్లో కొలతలు వేశారు. తనిఖీల్లో జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి, ఇరిగేషన్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కలవచర్లలో అక్రమంగా తవ్వేసిన పోలవరం గట్లను పరిశీలిస్తున్న అధికారులు



ఇదేమి కాలమో వరుణుడు మరచిపోయినట్టున్నాడు.. భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు.. గతంలో ఎన్నడూ లేనంతగా ఎండలు మండుతున్నాయి.. రాజమండ్రిలో శనివారం కెమెరాకు చిక్కిన ఈ చిత్రాలే అందుకు నిదర్శనం.. ఎండ తాళలేక ఎలా వెళుతున్నారో చూడండి.. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం


(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వాహనయోగమే!

- దివ్యాంగుల కోసం మరో పథకం
- అర్హులకు రెట్రోఫిటెడ్ వాహనాలు అందజేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించే అవకాశం

దివ్యాంగులకు కూటమి సర్కారు తీపి కబురు చెప్పనుంది. ఇప్పటికే ఇంధన రాయితీ, శాశ్వత గుర్తింపు కార్డులు అందజేసిన సర్కారు ఈసారి నూరుశాతం రాయితీతో మూడు చక్రాల వాహనాలు(రెట్రోఫిటెడ్ వాహనాలు) అందించేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. అర్హుల జాబితాను తయారు చేసి త్వరితగతిన వాహనాలు అందజేసేందుకు ఇంధన రాయితీ కల్పించిన ప్రభుత్వం మరోసారి రూ.లక్ష విలువైన వాహనాలను ఉచితంగా అందజేస్తారని ప్రకటన వెలువడడంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్యకాలంలో రెట్రోఫిటెడ్ వాహనాలను అందజేసింది. వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిరక్ష్యం చేసింది. ఐదేళ్ల కాలంలో ఒక్కసారే పంపిణీ చేశారు. దీంతో ఎంతోమంది దివ్యాంగులకు ఈ వాహనయోగం కలగలేదు. ఎక్కడికైనా వెళ్లాలంటే వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. ఎవరొకరిపై ఆధారపడాల్సి వచ్చేది. ఎన్నికల హామీలో భాగంగా సీఎం చంద్రబాబు పెన్షన్ పెంచడం, ఆ తర్వాత ఇంధన రాయితీ, ఇప్పుడు రూ.లక్ష విలువ చేసే వాహనాలనుఅందించాలనుకోవడం ఆనందంగా ఉందని దివ్యాంగులు చెబుతున్నారు. తమ పనులు తాము చేసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు.

ఇలా చేయాలి

దివ్యాంగులు ఈవాహనాలు పొందాలంటే ఇలా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతోపాటు వైకల్యం 70శాతం నిర్ధారించే సదరం సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పదోతరగతి సర్టిఫికెట్, బ్యాంక్ వివరాలు, ఆధార్, రేషన్‌కార్డులు, వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పనిచేస్తున్నట్టు ధ్రువీకరణ పత్రంతో జిల్లాలోని వయోవృద్ధులు,విభిన్న ప్రతిభావంతులశాఖ కార్యాలయంలో అందజేయాలి.

అర్హతలు ఇవీ

మూడు చక్రాలవాహనాల పంపిణీకి దివ్యాంగులకుగల అర్హతలను ఇప్పటికే ప్రభుత్వం నిర్ధారించింది. డిగ్రీ ఆపై ఉన్న విద్యనభ్యసించే విద్యార్థులకు, స్వయం ఉపాధి రంగంలో ఉన్నవారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. 18-45 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, 70శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారు దీనికి అర్హులు అని అధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గానికి పదేసి వాహనాలు

తొలి దశలో నియోజకవర్గానికి పది చొప్పున వాహనాలు అందజేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏటా ఇలా మరికొందరి దివ్యాంగులకు ఈ వాహనాలు అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. స్వచ్ఛంద సంస్థల ద్వారా మరికొంతమందికి వీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో ప్రతి లబ్ధిదారుడికి వాహనం అందుతుందని అధికారులు చెప్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2లక్షలమంది దివ్యాంగులు ఉన్నారు. గతంలో నియోజకవర్గానికి పదేసి చొప్పున ఇచ్చినట్టుగానే ఈసారి కూడా అందజేయనున్నారు.

త్వరలోనే వాహనాలు అందజేస్తాం

ప్రభుత్వ ఆదేశాలు అందగానే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తాం. కూటమి ప్రభుత్వం అందజేయనున్న ఈ వాహనాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలి. ఈపథకాన్ని సద్వినియో గం చేసుకోవాలి. అర్హుల ఎంపిక పూర్తయ్యాక వీలైనంత త్వరలోనే వాహనాలను అందజేస్తాం.

-ఏ.వై.శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ శాఖ, ఏడీ, కాకినాడ జిల్లా

శాకాహారుల పులస

ఆగాకరకాయ కిలో రూ. 200



సామర్లకోట, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): ఆషాడం, శ్రావణమాసాలలో లభించే ఆగాకర కాయల కూర రుచి ఒక్కసారైనా చూడాలని పలువురు తహతహలాడుతుంటారు. వీటి ధర చూసి సామాన్యులే కాదు, ధనికులు సైతం అమ్మో అని వెనుకంజ వేస్తుండడం గమనార్హం. వీటి ధర కిలో రూ.180 నుంచి రూ.200 వరకూ పలుకుతుంది. ఏడాదిలో కేవలం రెండు నెలలు మాత్రమే పండే ఆగాకరకాయలు మార్కెట్‌లో అందరినీ ఆకర్షిస్తున్నాయి. సామర్లకోట, పెద్దాపురం మార్కెట్లకు గత రెండు రోజులుగా ఆగాకరకాయలు పెద్దనిమ్మకాయల పరిమాణంలో లభిస్తున్నాయి. సాధారణంగా ఈ పంట ఏజెన్సీ ప్రాంతాలలోనూ పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోనూ విరివిగా పండుతాయని అయితే అధిక వర్షాల కారణంగా దిగుమతులు అంతంతమాత్రంగానే ఉండడంతో సహజంగానే ఆగాకరకాయలకు గిరాకీ పెరిగింది. నెలా పదిహేను రోజుల పాటు వ్యాపారులు వీటిని మార్కెట్లలో విక్రయిస్తూ లాభాలను ఆర్జిస్తుంటారు. ఆగాకరకాయలు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్ గుణాలు కలిగి ఉంటాయి. వీటితో ఇన్ఫెక్షన్లు, దగ్గు, జలుబులు, చెవినొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. కంటితోపాటు పక్షవాతం, వాపు లాంటి అనారోగ్య సమస్యలను నివారిస్తాయి. శిశువు ఎదుగుదలకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. గర్భిణీలకు మంచి ఫుడ్. కనీసం వారానికి రెండు సార్లు తింటే మంచిదని వైద్యనిపుణురాలు డాక్టర్ ప్రవీణ తెలిపారు. మరో నెలరోజులపాటు ఆగాకరకాయలు మార్కెట్లకు వస్తాయని అందుకే వీటికి ఈ ధర ఉందని మార్కెట్ వ్యాపారులు చెబుతున్నారు.


శ్రీనివాసరావును సత్కరిస్తున్న మాజీ వీసీలు ప్రసాదరాజు, మురళీకృష్ణ

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

జేఎన్టీయూకే, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వర్శిటీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో లెవరేజింగ్ అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ఫర్ కంటిన్యూస్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై వారం రోజులపాటు నుంచి నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యూఢిల్లీలోని ఎన్ఐఈపీఏ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో నాణ్యతను పెంచేందుకు అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ఒక కీలక మా ర్గం అన్నారు. అధ్యాపకులు తమ బోధనా విధానాలను నిరంతరం మెరుగుపరుచుకోవడమే విద్యార్థుల అభివృద్ధికి దారితీస్తుందన్నారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిని మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, పద్మరాజు, వైస్ ప్రిన్సిపాల్స్ దీక్షితులు, స్వరూపారాణి, డైరెకర్లు బాలాజీ, కృష్ణప్రసాద్, విభాగాధిపతి లీలాకుమారి సత్కరించి ఎఫ్‌డీపీలో పాల్గొన్న అధ్యాపకులు ధ్రువపత్రాలను అందజేశారు.

ఐటీఐల అభివృద్ధికి నిధుల కేటాయింపు


ఏపీ, తెలంగాణ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 2(ఆంధ్ర జ్యోతి): ఆంధ్ర రాష్ట్రానికి ఇదొక మంచి సువర్ణ అవకాశమని స్కిల్ డెవలప్‌మెంట్‌ప్రోగ్రాంపై ప్రభుత్వం కూడా ఎంతో పట్టుదలగా ముందుకు వెళుతుందని రెండేళ్ల క్రితం నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధికి రూ.66వేల కోట్ల నిధులు కేటాయించడంతోనే ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్‌పరంగా అభివృద్ధి ముందుకు వెళుతుందని ఏపీ, తెలంగాణ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ రీజనల్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఐటీఐలు అభివృద్ధిలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలనకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కు ఆయన శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాల్ వర్మ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు, డిప్యూ టీ ట్రైనింగ్ ఆఫీసర్లు, ట్రైనింగ్ ఆఫీసర్లుతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐటీఐలను అభివృద్ధి చేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వం రూ.66,000 కోట్లు కేటాయించినట్లు, మొదటి విడతగా తిరుపతి, వైజాగ్ ఐటీఐలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీని ద్వారా ఆధునిక యంత్ర పరికరాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. ఐటీఐలు ఏర్పాటుచేసి సుమారు యాభై ఏళ్లపైనే అవుతుంది. కాబట్టి పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీఐల్లో 10 కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు మరిన్ని ఉద్యోగావకాశాలు, అప్రెంటీస్ కల్పించడానికి పరిశ్రమతో ఓ ఎంవోయులు చేస్తున్నామన్నారు.


హిమాచల్‌ప్రదేశ్-తమిళనాడు మధ్య జరుగుతున్న పోటీ

ఉల్లాసంగా...

- రెండోరోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు


బాల్‌కోసం పోరాడుతున్న క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 2(ఆంధ్ర జ్యోతి): హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యం లో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న 15వ జాతీయ జూనియర్ మహిళా హాకీ పోటీలు రెండోరోజు శనివారం ఉల్లాసంగా జరిగాయి. లీగ్ కమ్ నాకౌట్ దశలో జరుగుతున్న ఈ పోటీలలో గోయన్స్ దద్రానగర్ హవేలి, డామన్ డయ్యు మధ్య జరిగిన మ్యాచ్లో 4-0 స్కోర్‌తో గోయన్స్ హాకీ జట్టు, మిజోరాం, గుజరాత్ మధ్య జరిగిన మ్యాచ్లో మిజోరాం 9-0 స్కోర్ తోను రాజస్థాన్, తెలంగాణ మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 6-1 స్కోర్‌తో విజయం సాధించాయి. కేరళ, పాం డుచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ 4-2 స్కోర్‌తో గెలుపొందింది. హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఢిల్లీ, అరుణాచల్‌ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్లో ఢిల్లీ 4-2 స్కోర్‌తో గెలుపొందింది. శనివారం నిర్వహించిన మ్యాచ్‌లో సీనియర్ పీఈటీ బంగ్రారాజు క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. మ్యాచ్‌లను రాష్ట్ర హాకీ సంఘ అధ్యక్షుడు బి.చాణిక్య రాజు, కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.థామస్ పీటర్, ఉపాధ్యాక్షుడు సూర్యప్రకాష్, భవాని శంకర్, సుధీర్ పోటీలను పర్యవేక్షించారు.


హోరాహోరీగా జరుగుతున్న పోటీలు



ఓ పోలీస్ కష్టాలు..

కాకినాడ నగరంలో వాహనం మీద వెళుతూ పోలీస్ అన్న ఓ భుజానికి తుపాకీ, మరో భుజానికి లగేజీ బ్యాగ్ తగిలించుకుని అవస్థలు పడుతూ డ్రైవింగ్ చేస్తూ వెళుతున్న దృశ్యం ఆంధ్రజ్యోతి కెమెరాకు చిక్కింది.

-ఫొటో స్టాఫ్ ఫొటో గ్రాఫర్ కాకినాడ

దెయ్యాలు ఉన్నాయని భయపెట్టినా..

క్యాంపస్‌లోనే ఉంటున్నా!

- సమస్యలు పరిష్కరిస్తూ.. వర్శిటీ అభివృద్ధికి పాటుపడుతున్నా..
- ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రసన్నశ్రీ



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఒకనాడు నన్నయ వర్శిటీలో ప్రతి రోజూ ఏదో ఒక గొడవ.. భోజనం బాగాలేదని.. వర్శిటీ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉందని.. సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని..ఈవ్‌టీజింగ్ రకరకాల సమస్యలపై విద్యార్థులు ఆందోళనకు దిగిన సంఘటనలు అనేకం.. ఆ సమస్యలన్నింటినీ పరిష్కరించారు నన్నయ వర్శిటీ వీసీ ప్రసన్నశ్రీ.. ఈ సందర్భంగా ఆమెతో ఆంధ్రజ్యోతి చిట్‌చాట్..

విద్యార్థులు చదువుకు హితులవ్వాలి..

వీసీ: లైబ్రరీ అనేది క్యాంపస్‌కు దేవాలయం వంటిది. విద్యార్థులు నిత్యం అక్కడకు వెళ్లి చదవాలి. విద్యార్థులు పుస్తకాలకు హితులవ్వడం వల్ల వారిలో చైతన్యం వస్తుంది. వర్శిటీలో సుమారు 3000 మంది విద్యార్థులున్నారు. ఆర్ట్స్ కాలేజీ ప్రతి రోజు ఉదయం8.30 గంటల నుంచి సాయంత్రం వరకూ జరుగుతుంది. ఇక ఉదయం 8 గంటల నుంచి 1.30 గంటల వరకూ నిర్వహిస్తాం.మధ్యాహ్నం నుంచి విద్యార్థులంతా లైబ్రరీలో పుస్తకాలు చదివేటట్టు ప్రయత్నం చేస్తున్నాం. సైన్స్ కాలేజీ 9.30గంటల నుంచి 4.30గంటల వరకూ నడుస్తోంది. నన్నయ మ్యూజియం ఏర్పాటు చేయనున్నాం. ఆకర్షణీయంగా నీడ గడియారం ఏర్పాటు చేశాం.

సిబ్బంది కొరత ఉంది..

వర్శిటీలో 400మంది వరకూ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారు.ఇంకా అవసరం ఉంది. నలుగురైదుగురు చేసే పనిని ఒకరు చేయాల్సి వస్తుంది. ఇక షిఫ్ట్ విధానంలో మార్చుతేనున్నాం. అందరూ ఒకే సమయం పాటించే యోచన చేస్తున్నాం. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ నిర్ణీత వేళలు పాటించాలి. బస్సు వచ్చే సమయానికి బయట కుర్చీ వేసుకుని కూర్చుంటున్నా.మొదట్లో ఇష్టానుసారం వచ్చేవారు కూడా ఇవాళ సమయపాలన చేస్తున్నారు. వర్శిటీ పరిధిలో 392 కాలేజీలు ఉన్నాయి.

వర్శిటీ పాలనపై రాజకీయ జోక్యం తగదు..

సిస్టమ్ బాగుండాలి. రాజకీయ సభలు కాకుండా విద్యాపరమైన అంశాలతో కూడిన మీటింగ్‌లు ఉండాలి. యూనివర్శిటీ పాలనా పరమైన అంశాల్లో రాజకీయ జోక్యం మంచిది కాదని నా ఫీలింగ్. అమ్మాయిలను వేధించిన వాళ్లను ఆన్ ది స్పాట్ పంపించేయాలి. కాని రకరకాల రాజకీయ ఒత్తిళ్ల వల్ల సిబ్బంది తప్పు చేసినా పంపలేని పరిస్థితి. అది విశ్వవిద్యాలయం బలహీనతగా మారకూడదు. పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నా. అమ్మాయిలకు అండగా ఉంటున్నా.

వర్శిటీ క్యాంపస్‌లోనే నివాసం?

వీసీ: ఇవాళ చూడండి. నేను కూడా హాస్టల్‌లోనే భోజనం చేస్తున్నా. అందరూ హ్యాపీగా ఉన్నారు. నేను వర్శిటీ క్యాంపస్‌లోని వీసీ భవనంలోనే నివసిస్తున్నా. గతంలో ఎవరూ ఉండేవారు కాదు.. నన్నూ ఉండవద్దన్నారు. దెయ్యాలు ఉన్నాయని.. పాములు వస్తాయని భయపెట్టాలని చూశారు. కానీ నేను వినలేదు. ఇక్కడే ఉండి రాత్రి వేళ్లలో కూడా హాస్టళ్ల పరిస్థితిని పరిశీలిస్తున్నా.

నాలుగు భవనాలు పూర్తిచేస్తున్నాం..?

వీసీ: 2019 వరకూ ఉన్న ప్రభుత్వంలోనే నాలుగు భవనాలు మంజూరయ్యాయి. రకరకాల కారణాలతో తర్వాత పనులు సరిగ్గా కదలలేదు. ఇటీవల పనులు వేగవంతం చేశారు. సెప్టెంబరులోపు నాలుగు భవనాలు పూర్తిచేస్తాం. వర్శిటీకి అన్ని సొంత నిధులే..ప్రభుత్వం నిధులేమీ ఇవ్వడంలేదు. వర్శిటీ ఏర్పాటుకు భూమిని సొంత నిధులతో కొన్నాం. 360 ఎకరాలతో మొదటి ప్రభుత్వం నోటిఫై చేసింది.తర్వాత అది 250 ఎకరాలకు వచ్చింది. చివరకు రూ.91 ఎకరాలే ఇచ్చింది. మిగతా భూమి ఇస్తే పెద్ద వర్శిటీ అవుతుంది.

కొత్త కోర్సులను ప్రతిపాదించాం?

వీసీ: చాలా కొత్తకోర్సులు ప్రతిపాదించాం. డిప్లమో, సర్టిఫికెట్, పీజీ డిప్లమో వంటి కోర్సులు ప్రారంభించే యోచనలో ఉన్నాం. 3, 4, 6 నెలలు, ఏడాది కాలపరిమితిలో ఉండే కోర్సులను ప్రతిపాదించాం. మూడు నెలల కాల వ్యవధి అంటే సర్టిఫికెట్ కోర్సులు ఉంటాయి.

ప్రజల సహకారం కావాలి

వర్శిటీలో కొన్ని భవనాల పనులు ఆగిపోయాయి. ఎవరైనా దాతలు వచ్చి భవన నిర్మాణానికి అయ్యే ఖర్చులో సగం ఖర్చు భరిస్తే, ఆ భవనానికి వారికి ఇష్టమైన వారిపేరు పెట్టుకోవచ్చు. అందువల్ల దాతలు ముందుకు రావాలని కోరుతున్నాను. కలెక్టర్ పి.ప్రశాంతి దృష్టికి సమస్యను తీసుకెళ్లాను. గతంలో పోస్టల్, ఇతర కార్యాలయాలకు ఇక్కడి భవనాలు ఇచ్చారు. వాటిని ఖాళీ చేయిస్తున్నా.

దివాన్‌చెరువు ఫ్లైవోవర్‌కు

వర్చువల్‌గా శంకుస్థాపన

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు జాతీయ రహదారి అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శనివారం విజయవాడ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.దివాన్‌చెరువు ఫ్లైవోవర్ ను గామన్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు జంక్షన్ నుంచి 3 కిలో మీటర్ల మేర రూ.327 కోట్లతో నిర్మించనున్నారు. ఇప్పటికే ఇక్కడ భూమి సేకరించడంతోపాటు, ఆక్రమణలు, ఇతర దుకాణాలు, ఇళ్లను కూడా తొలగించిన సంగతి తెలిసిందే. అలాగే రాజమండ్రి పరిధిలోని లాలాచెరువు, ఐటీసీ జంక్షన్, వేమగిరి జంక్షన్లను రూ.232 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ అండర్ పాసులు కూడా నిర్మించనున్నారు. విస్తరిస్తున్న చారిత్రిక రాజమహేంద్రవరం నగరానికి ఈ పనులు మరింత సౌకర్యాన్ని కల్పించనున్నాయి.

పుష్కరాలపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ పంపండి

రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియా


రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం మోహిత్

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్ రైల్వే మేనేజరు మోహిత్ సోనాకియా శుక్రవారం రాజమండ్రి, గోదావరి రైల్వే స్టేషన్లలో కలియదిరిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ ప్రాంతాలను పరిశీలించారు.2027లో జరిగే పుష్కరాల నేపథ్యంలో ఆయన పర్యటన సాగింది. యాత్రికులకు సౌకర్యాలు కల్పించడానికి అవకాశం ఉన్న ఖాళీ ప్రదేశాలను చూశారు. గూడ్స్‌షెడ్, ఆర్పీఎఫ్ బ్యారెక్, ఎలక్ట్రికల్ రూంలు తదితర నిర్మాణాలను తొలగించడం, ఎఫ్‌ఓబీలతోసహా కొత్త నిర్మాణాలను ఎక్కడ చేయాలో సవివరంగా నివేదిక తయారు చేసి అందజేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. యాత్రికులు వచ్చిన వెంటనే స్టేషనులో ఎక్కడికి చేరుకోవాలో స్పష్టంగా నిర్దేశాలు ఉండాలన్నారు. అక్కడ అన్ని సదుపాయాలనూ కల్పించాల్సి ఉంటుందన్నారు. గోదావరి రైల్వేస్టేషను పరిశీలించి బ్రిడ్జి వైపు ప్లాట్‌ఫాం పొడవు పెంచడానికి ఉన్న అవకాశాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో సమన్వయం చేసుకొని రైల్వే చేయాల్సిన ఏర్పాట్లపై వివరంగా రిపోర్టును పంపాలని ఆర్పీఎఫ్‌ని ఆదేశించారు. తొలుతగా వీఐపీ లాంజ్‌లో అధికారులతో సమావేశమై మ్యాప్‌ను పరిశీలించి.. వారితో చర్చించారు. ఈ నెల 6 లేదా 7న దక్షిణ మధ్య రైల్వే జీఎం రాజమండ్రి రానున్న సందర్భంగా రైల్వే స్టేషన్లను డీఆర్ఎం నిశితంగా పరిశీలించారు.కార్యక్రమంలో సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ వరుణ్‌బాబు, సీనియర్ డీఈఎన్ నార్త్ గౌతమ్, సీనియర్ డీఓఎం నరేంద్రవర్మ,సీనియర్ డీసీఎం ప్రశాంత్‌కుమార్, ఏడీఈఎన్ ముత్యాలరావు, ఎస్ఎంఆర్ రంగనాథ్, ఆర్పీఎఫ్ ఇన్స్‌పెక్టర్ రాజు పాల్గొన్నారు.

గోవిందా..హరి గోవిందా..


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.67.67 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనం తరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి ఒక్కరోజు ఆదాయం రూ.67.67 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



గోల్డ్‌బాబు సందడి: వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోల్డ్‌బాబు సందడి చేశాడు. విజయవాడకు చెందిన వ్యాపారవేత్త మంచం శివశంకర సాయి కుమార్ ఒంటి నిండా బంగారు వస్తువులతో స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. రూ.కోటి విలువైన కిలో బంగారు ఆభరణాలు ధరించి తిరువీధుల్లో వేలాది మంది భక్తుల నడుమ ప్రదక్షిణలు చేశారు. భక్తులు సైతం గోల్డ్‌బాబును చూసి ఆశ్చర్యపోయారు. స్వామి వారిని దర్శించుకుని బయటకు వస్తున్న సమయంలో అతడితో సెల్ఫీలు దిగారు.

భీమేశ్వరాలయంలో కమ్యూనికేషన్స్ డీఐజీ పూజలు



ద్రాక్షారామ, జూలై 2(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శనివారం కమ్యూనికేషన్స్ డీఐజీ ఎన్ఎస్‌జే విజయలక్ష్మి సతీసమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శన అనంతరం బేడా మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు.

వినియోగదారుడు అంగీకరిస్తేనే స్మార్ట్‌మీటర్

- బలవంతంగా వేయడం లేదు
- తూర్పులో 44,646 అమర్చాం
- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 2(ఆంధ్ర జ్యోతి): స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు బలవంతంగా వేయడంలేదని, వారు అంగీకరిస్తేనే అమర్చుతున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్వాన్స్ ప్లానింగ్ సిస్టమ్ స్మార్ట్ మీటర్ ద్వారా సాధ్యమౌతుందన్నారు. పూర్వం ఎలక్ట్రోమేకానిక్ మీటర్లు ఉండేవని రీడింగ్ తీసుకుని బిల్లులు అటుపై తీసుకువచ్చి ఇచ్చేవారని, అటుపై ఎలక్ట్రానిక్ మీటర్లు వచ్చాయి. కొంతకాలం రీడింగ్ తీసుకుని బిల్లును ఇచ్చేవారని అందులోనే క్యూఆర్ కోడ్ మీటర్లు ప్రవేశించాయన్నారు. స్కాన్ చేసి కరెంట్ బిల్లును జనరేట్ చేసే విధానం వచ్చిందన్నారు. ఇప్పుడు తాజాగా వచ్చిన స్మార్ట్ మీటర్ వల్ల అడ్వాన్స్ ప్లానింగ్ చేసుకోవచ్చన్నారు. వినియోగదారుడి ఆండ్రాయిడ్ మొబైల్‌లోనే తాను వినియోగిస్తున్న విద్యుత్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు సాంకేతికతను అంగీకరిస్తే మార్పు సాధ్యమై అభివృద్ధి సాధించవచ్చన్నారు. బిల్లు చెల్లింపులు సులభతరం అవుతుందన్నారు. ఇందులో రీచార్జిబుల్ అనేది వినియోగదారుడు ఇష్టాన్ని బట్టి ఉంటుందని కాని కచ్చితం కాదన్నారు.స్మార్ట్ మీటర్ విషయంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని చెప్పారు.జిల్లాలో ఇప్పటివరకు 44,646 స్మార్ట్ మీటర్లును అమర్చామని, ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి సామ్యూల్, ఏ రాజశేఖర్, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

నన్నయలో 21, 22 తేదీల్లో జాతీయ సదస్సు

బ్రోచర్ ఆవిష్కరణలో వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 21, 22 తేదీల్లో గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను విశ్వవిద్యాలయంలో శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నన్నయ వర్శిటీ విద్యాకళాశాల ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్, ఎన్‌సీఎస్టీ ఆర్థిక సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా గిరిజన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సంస్కృతి, ఆదివాసి సంపద, గిరిజనహక్కులు, విద్య, వైద్యం, గిరిజన మహిళల విద్యఆవశ్యకత మొదలైన ఆంశాలు చర్చిస్తారని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, సామాజికప్రముఖులు, గిరిజన సలహాదారులు, పరిశోధకులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను, అభిప్రాయాలను పంచుకుంటారని చెప్పారు.

కలిసిరాని శ్రావణం..

- నేలచూపులు చూస్తున్న కర్పూర అరటి
- గతేడాది కంటే దిగజారిన ధరలు
- గెల రూ.100 నుంచి రూ.350లోపే
- రైతులు లబోదిబో

రావులపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతుల ఆశలు ఆవిరి అయ్యాయి. శ్రావణంలో కూడా కర్పూర రకం అరటికి అనుకున్న ధర పలకకపోవడంతో నిరాశ చెందుతున్నారు. అంతర్ రాష్ట్ర అరటి మార్కెట్ యార్డుగా ఖ్యాతి గాంచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు నిత్యం 10 వేల నుంచి 12వేల అరటి గెలల వరకు రైతులు తీసుకొస్తుంటారు. కాగా వీటిలో 6వేల నుంచి 8 వేల గెలల వరకూ కర్పూర రకం అరటే మార్కెట్ యార్డుకు వస్తుంది. ఆషాఢం మాసంలో పెళ్లిళ్లు, శుభ ముహూర్తాలు లేకపోవడంతో ధరలు పెద్దగా పలకలేదు. శ్రావణ మాసం ప్రారంభం నుంచి శుభ కార్యాలు పండుగలు పూజలు, పర్వదినాలు ఉండటంతో కర్పూర రకం అరటికి అనుకున్న ధర కంటే అధిక ధర పలుకుతుందని రైతులు ఎదురుచూశారు. ఏదోకొది మేర మాత్రమే పెరగడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.



రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కర్పూర అరటిగెలలు

ప్రస్తుతం ఇలా.. గతంలో అలా...

దిగుబడి పెరగడంతో గెలలు కూడా మార్కెట్‌కు పెద్దఎత్తున తరలివస్తున్నాయి. అయితే ప్రస్తుతం కర్పూర రకం అరటి గెల రూ.100 నుంచి రూ.350 వరకూ మాత్రమే పలుకుతుంది. అధిక పెట్టుబడులు పెట్టి ఎన్నో వ్యయప్రయాసలతో సాగు చేసిన పంట చేతికి అందివచ్చిన తరుణంలో అనుకున్న ధర పలకకపోవడంతో అరటి రైతులు ఎంతో ఆవేదన చెందుతున్నారు. గతేడాది శ్రావణ మాసం ప్రారంభంలో కర్పూర రకం అరటిగెల రూ.400 నుంచి రూ.600 వరకు పలికి రైతులు లాభాల బాట పట్టేవిధంగా మార్కెట్ సాగింది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితే కనిపించడంలేదని రైతులు దిగాలు చెందుతున్నారు.

వ్యాన్ ఢీకొని గిరిజనుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- అల్లూరి జిల్లా
- సీమగండి మలుపు వద్ద ఘటన

రంపచోడవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఐసర్ వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో గిరిజనుడు మృతిచెందాడు. అల్లూరి జిల్లా మారేడుమిల్లి మండలం తూరు మామిడి గ్రామానికి చెందిన మడి పోతన్నదొర, కింటుకూరు గ్రామానికి చెందిన పాలంచి బుచ్చన్నదొర ద్విచక్రవాహనంపై బంధువులను పరామర్శించేందుకు శనివారం సోకులగూడెం వచ్చారు. తిరుగు ప్రయాణంలో పెద గెద్దాడ శివారు సీమగండి మలుపు వద్ద మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వైపు వస్తున్న ఐసర్ వ్యాన్ వారి ఢీకొంది. ప్రమాదంలో పాలంచి బుచ్చన్నదొర(40) అక్కడికక్కడే మృతిచెందగా మడి పోతన్నదొరకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్సనందించి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మరణించిన బుచ్చన్నదొర



తీవ్ర గాయాలైన మడి పోతన్నదొర

రాజమహేంద్రవరంలో అగ్నిప్రమాదం

కాలి బూడిదైన ఫుట్‌వేర్ షాపు స్టాకు



షాపు నుంచి వస్తున్న పొగమంటలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్యామలా టాకీస్ సమీపంలోని ఒక ఫుట్‌వేర్ షాపులో అగ్ని ప్రమాదం సంభవించింది. డీఎఫ్‌వో మార్టిన్ లూథర్ కింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలాజీ అక్వేరియం అండ్ పెట్, ఫ్యాక్టరీ ఫుట్‌వేర్ షాపుల్లో మంటలు వస్తున్నాయని శనివారం ఉదయం ఫోన్ వచ్చిందన్నారు. వెంటనే రాజమండ్రి, కొవ్వూరు నుంచి 3 ఫైరింజన్లను, సిబ్బందిని పంపించామన్నారు. శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల నిప్పు రాజుకుని ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. చెప్పులు, అట్టల వల్ల స్టాకు బూడిదైందని చెప్పారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించామన్నారు. ప్రాణ నష్టం జరగలేదని, ఆస్తి నష్టం అంచనా వేస్తున్నామన్నారు.

అసలేం జరిగింది..!

ఫైరింజన్లు రావడం ఆలస్యం కావడంతో ఫుట్‌వేర్ షాపు పక్కనే ఉన్న అక్వేరియం, పెట్ షాప్‌కు కూడా మంటలంటుకుని మూగజీవాలు బలై, ఫుట్‌వేర్ షాపులో స్టాకు మొత్తం కాలిపోయిందని తెలుస్తోంది. చెప్పుల దుకాణం నుంచి మంటలు వస్తున్నాయని ఓ వ్యక్తి ఉదయం 6గంటల సమయంలో దగ్గరలో ఉన్న ఇన్నీసుపేట ఫైర్ స్టేషనుకు పరుగులు పెట్టాడు. అయితే అక్కడ ఒక్క ఉద్యోగి మాత్రమే ఉన్నాను కొవ్వూరు లేదా ఆర్యాపురం నుంచి ఫైరింజను వస్తుందని చెప్పడంతో అతడు వెనుదిరిగాడు. అరగంట అయినా రాకపోవడంతో మళ్లీ వెళ్లి మరింత బతిమలాడగా, మరో పావుగంట తర్వాత ఫైరింజను ఘటనా ప్రాంతానికి చేరుకుంది. ఈలోపు ఫుట్‌వేర్‌ని అనుకొని ఉన్న షాపులోకి మంటలు వ్యాపించి పక్షులు, కుక్కలు తదితర మూగజీవాలు బూడిదైపోయాయని స్థానికులు చెప్పారు. ఇన్నీసుపేట ఫైర్ స్టేషను నుంచి ఘటనా ప్రదేశం సుమారు 500 మీటర్లు మాత్రమే ఉండడం గమనార్హం.

కొడుకు.. కుట్ర!

- బీమా కోసం మానవత్వాన్ని మంటకలిపి కన్నతండ్రిపై కొడుకు హత్యాయత్నం
- ప్రాణాలతో బయటపడ్డ తండ్రి
- కటకటాల పాలైన కొడుకు



హత్య చేసేందుకు వినియోగించిన కారు



నిందితుడు హర్షవర్ధన్

బీమా సొమ్ముల కోసం మానవత్వాన్ని మంటకలిపి కన్న తండ్రినే చంపాలనుకున్నాడు కొడుకు. మోటారుసైకిల్‌పై వెళ్తున్న తండ్రిని కారుతో ఢీకొన్నాడు. పైగా గుర్తు తెలియని వాహనం ఢీకొందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసు విచారణలో ఆలస్యంగా నిజాలు బయటపడడంతో కటకటాల పాలయ్యాడు.

అమలాపురం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో విప్పర్తి హర్షవర్ధన్‌ను అమలాపురం తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను శనివారం అమలాపురం తాలూకా ఎస్‌ఐ వై.శేఖరబాబు విలేకర్లకు వివరించారు. కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం సాకుర్రుకు చెందిన విప్పర్తి వెంకటరమణ వడ్రంగి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడి కుమారుడైన హర్షవర్ధన్ కంప్యూటర్‌లో డిప్లమో పూర్తిచేసి ఖాళీగా ఉంటున్నాడు. వైసీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అనుంగ అనుచరుల్లో ఒకడిగా గుర్తింపు పొందాడు. ఇటీవల హర్షవర్ధన్ సోదరి వివాహం చేశాడు. ఇల్లు కూడా కట్టుకున్నాడు. అయితే అప్పులు పెరిగిపోవడంతో తండ్రి వెంకటరమణ కోరమండల్ ఫైనాన్స్‌లో రూ.13లక్షలు రుణంగా తీసుకున్నాడు. అదే సమయంలో ఇన్సూరెన్సు ప్రీమియం కింద రూ.20వేలు కట్ చేశారు. ఆ విషయాన్ని అప్పట్లోనే హర్షవర్ధన్ మదిలో పెట్టుకున్నాడు. అంతే తండ్రిని చంపేస్తే తన ఈఎంఐల బాధ ఉండదు. ఇన్సూరెన్సు వస్తుందని పక్కా పథక రచన చేశాడు.

రూ.500 కావాలని పిలిచి..

ఏప్రిల్ 21న ఓ ఇన్నోవా కారును దుర్గాప్రసాద్ అనే వ్యక్తి వద్ద అద్దెకు తీసుకున్నాడు. పేరూరు వై.జంక్షన్‌లో కారుతో వెళ్లి తండ్రి వెంకటరమణకు ఫోన్ చేసి అర్జెంటుగా రూ.500 కావాలని చెప్పాడు. కొడుకుకు ఏ అవసరం వచ్చిందోనని మోటారుసైకిల్‌పై వెంకటరమణ భట్నవిల్లి బైపాస్ రోడ్డు వద్దకు చేరుకున్నాడు. తర్వాత స్వగ్రామమైన సాకుర్రు వెళ్లేందుకు బైపాస్ రోడ్డులో వెంకటరమణ మోటారుసైకిల్‌పై బయలుదేరాడు. కామనగరువు సమీపంలో తండ్రి బైక్‌ను కారుతో వేగంగా వచ్చి హర్షవర్ధన్ ఢీకొన్నాడు. తండ్రి చనిపోయాడని భావించి డ్యామేజ్ అయిన కారును తీసుకుని రోళ్లపాలెంలోని ఖాళీ స్థలంలో వదిలేసి హర్షవర్ధన్ బయటపడ్డాడు. బైపాస్ రోడ్డులో తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలో ఉన్న వెంకటరమణను స్థానికులు గుర్తించారు. అతడి వద్దనున్న సెల్‌ఫోన్‌లో చివరిగా ఫోన్ మాట్లాడిన కొడుకు హర్షవర్ధన్‌కు ఫోన్ చేసి విషయం తెలిపారు. దీంతో చేసేదేదిలేక తండ్రిని కిమ్స్ ఆసుపత్రికి తరలించాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు అమలాపురం తాలూకా పోలీసులు ఏప్రిల్ 22న కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు.

పట్టించిన కారు..

తెలుపురంగు కారు గుద్దీ వెళ్లినట్టు స్థానికులు చెప్పారు. అయితే బైపాస్ రోడ్డుకు సమీపంలోనే డ్యామేజ్ అయిన కారును ఉంచిన విషయాన్ని ఆ తోట యజమాని పోలీసుల దృష్టికి తీసుకువచ్చాడు. అది కూడా తెల్లకారే కావడంతో ఆ కారే ప్రమాదానికి వినియోగించిన కారుగా భావించారు. ఇన్నోవా కార్లను రాజమహేంద్రవరంలో కంపెనీ షోరూం వద్ద మరమ్మతులు చేస్తారని గుర్తించి అక్కడికి వెళ్లారు. ప్రమాదం జరిగిన తరువాత ఇప్పటి వరకు ఎన్నికార్లకు మరమ్మతులు చేశారో రికార్డులు పరిశీలించగా 5 తెలుపురంగు కార్లను గుర్తించారు. అయితే వాటిలో నాలుగు కార్లు కేవలం సర్వీసింగ్‌కు వచ్చినట్టు గుర్తించారు. ఒక కారు మాత్రం మరమ్మతులు చేసినట్టు గుర్తించి సంబంధిత నంబరుకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. చెట్టును ఢీకొనడం వల్ల ముందు భాగం దెబ్బతిందని చెప్పడంతో కారు యజమాని దుర్గాప్రసాద్ కొన్ని రోజుల అనంతరం అక్కడి నుంచి కారును తీసుకువెళ్లి మరమ్మతులు చేయించుకున్నట్టు చెప్పాడు. అంతేకాకుండా హర్షవర్ధన్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ప్రమాదం జరిగిన సమయంలో అక్కడే సూచించడంతో హర్షవర్ధనే నిందితుడిగా పోలీసులు గుర్తించారు. ఈనెల 1న సాయంత్రం సాకుర్రు పీఆర్వో అయినాపురపు కృష్ణ ఎదుట హర్షవర్ధన్ లొంగిపోవడంతో పోలీసులకు ఆయన సమాచారం అందించాడు. హర్షవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శేఖర్‌బాబు తెలిపారు. అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. తండ్రిని చంపేందుకు ఉపయోగించిన ఇన్నోవా క్రిస్టా కారును సీజ్ చేశామన్నారు. కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసిన రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ శేఖర్‌బాబు, సిబ్బంది సీహెచ్ ఏసుబాబు, ఎం.నాగరాజు, కె.ఫణీంద్రకుమార్‌ను ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. కొడుకే తనపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలుసుకున్న తండ్రి తల్లడిల్లి పోయాడు. పోలీసుల అదుపులో ఉన్న కొడుకుకు తండ్రే శనివారం భోజనం క్యారేజీ తీసుకురావడం చూసి అందరిక కళ్లు చెమర్చాయి.

గంజాయితో వ్యక్తి అరెస్ట్

జగ్గంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట నుంచి కాకినాడ రోడ్డులో కాట్రావులపల్లి మెరకవీధికి చెందిన కె.లోవరాజు అలియాస్ పటేల్‌ను 4.38 కిలోల గంజాయితో శనివారం అరెస్ట్ చేశారు. కాట్రావులపల్లి ఐవోసీఎల్ పెట్రోల్ బంక్ సమీపంలో పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు పర్యవేక్షణలో సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్‌ఐ శ్రీ రఘునందన్‌రావు నిందితుడిని అరెస్ట్ చేశారు. 4.38 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని పెద్దాపురం కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.



నిందితుడిని పట్టుకున్న పోలీసులు

సత్యదేవుడి ఖజానాకు భారీ ఆదాయం

- దేవస్థానంలో సెల్‌ఫోన్లు భద్రపరిచే లైసెన్స్ హక్కుకు బహిరంగ వేలం
- రూ.97.32 లక్షలు చెల్లించేందుకు ముందుకొచ్చిన గుత్తేదారు

అన్నవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు తమ సెల్‌ఫోన్లను భద్రపరిచేందుకు శనివారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలం ద్వారా స్వామి వారి ఖజానాకు భారీగా ఆదాయం లభించింది. ఏడాదికి రూ.97.32 లక్షలు చెల్లించేందుకు హెచ్చుపాటకు గుత్తేదారులు పోటీపడ్డారు. గతంలో ఈ లైసెన్స్ హక్కుకు రూ.39.72 లక్షలు మాత్రమే హెచ్చుపాట ఖరారయింది. ఒక్కో సెల్‌ఫోన్ భద్రపరిచేందుకు రూ.5 వసూలు చేయాలని టెండర్ షెడ్యూల్‌లో పొందుపరచగా గుత్తేదారు రూ.10 వసూలు చేసేవారు. దీనిపై గతంలో లోకాయుక్తాలో కేసు నమోదు చేయగా జరిమానా విధించారు. సింహాచలం, వాడపల్లి, ద్వారకా తిరుమల దేవస్థానాల్లో టెండర్ షెడ్యూల్ ఆధారంగా రూ.10 వసూలు చేసుకోవచ్చని ఆయా దేవస్థానాలు షెడ్యూల్ జారీచేయడంతో ఈ పర్యాయం అన్నవరం దేవస్థానంలో కూడా ఒక్కోఫోన్‌కు రూ.10 వసూలు చేసుకోవచ్చని పేర్కొనడంతో ఈ ఆదాయం లభించింది.

వేడుకగా ప్రాకారసేవ

సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్దకు మేళతాలతో తోడ్కొనివచ్చారు. అక్కడ నుంచి పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మురు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

అంతర్వేదిలో ఏపీ చీఫ్ సెక్రటరీ సతీమణి పూజలు

అంతర్వేది, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీ సతీమణి, కుటుంబ సభ్యులు శనివారం విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులతో మహదాశీర్వచనం జరిపించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను వారికి ఆలయ సహాయ కమిషనర్ ఎం.ప్రసాద్ అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ రామరాజు పాల్గొన్నారు.



సీఎస్ సతీమణి, కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

చినశంకర్లపూడిలో ఆరు తాటాకిళ్లు దగ్ధం

- పేలిన గ్యాస్ సిలిండర్లు
- రూ.15లక్షల నష్టం
- భయభ్రాంతులకు గురైన ప్రజలు



చినశంకర్లపూడిలో దగ్ధమవుతున్న తాటాకిళ్లు

ప్రత్తిపాడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి గ్రామంలో శనివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దళితవాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆరు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.15లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. చినశంకర్లపూడి దళితవాడలో శనివారం వేకువజాము 1గంట సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణం గా ఓ తాటాకింటికి మంటలు అంటు కుని 5గృహాలకు వ్యాపించాయి. దీంతో గంటన్నర వ్యవధిలో కాలిబూడిదయ్యాయి. ఇళ్లల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు మంటల్లో పేలడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మంగారావు, రాజబాబు, పి.అచ్చయ్య, పి.అప్పారావు, ఎం.నాగేశ్వరరావు, కె.సత్తిబాబుకు చెందిన తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. బీరువాల్లోని దుస్తులు, బంగారు, వెండి, నగదు కాలిపోయాయి. సర్వం కోల్పోయి 6 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ప్రత్తిపాడు ఫైర్ సిబ్బంది కె.రాముడు, కేఎస్ఎన్ మూర్తి, వీరగణేష్, డీఎల్‌వో నాగయ్య బృందం అగ్నిమాపక శకటంతో వెళ్లి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాద బాధితులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించి ఓదార్చారు. దుస్తులు, నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, ఆర్థిక సహాయం అందజేశారు.



గ్యాస్ సిలిండర్లు పేలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

కాకినాడ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీ, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాలు, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఈఆర్‌ఈఐఎస్, ఏపీఆర్‌ఈఐఎస్, కేజీబీవీల యందు గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. ప్రైవేట్ తప్ప అన్ని యాజమాన్యాల్లో పనిచేస్తూ కనీసం 10ఏళ్ల బోధనానుభవం గల అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు deoeg.org వెబ్‌సైట్ నందు ఉంచబడిన దరఖాస్తును నియమ నిబంధనలననుసరించి అర్హత గల ఉపాధ్యాయులు పూరించి ఈనెల 12లోపు సంబంధిత తనిఖీ అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కోచింగ్

శ్యామ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ శ్యామ్



చైర్మన్ శ్యామ్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్స్ ఫలితాల్లో శ్యామ్ ఇనిస్టిట్యూట్ సాధించిన ఫలితాల్లో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ శ్యామ్ విలేకర్లతో మాట్లాడుతూ దాదాపు 4 వేలమందికి పైగా విద్యార్థులు పోలీస్ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారని తెలిపారు. ఒకే ప్రభుత్వ నోటిఫికేషన్లో 67 శాతం పైగా ఉద్యోగాలు సాధించి రికార్డు సృష్టించారన్నారు. ఇంతమందిని గెలిపించే అవకాశం రావడం దైవం నాకిచ్చిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నామన్నారు. 2001 నుంచి 2025 వరకు దాదాపుగా 30 వేల మంది విద్యార్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్ది శ్యామ్ ఇనిస్టిట్యూట్ ప్రభుత్వ ఉద్యోగుల మార్గసూచికగా మార్చామన్నారు. ఇప్పటి వరకు 5 సార్లు పోలీసు పరీక్షల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించడం జరిగిందన్నారు. పేద విద్యార్థుల కోసం తక్కువ ఫీజుతో ఆన్లైన్ కోచింగ్‌తో పాటు కాకినాడ వరకు రాలేని విద్యార్థుల కోసం దాదాపు 4 సంవత్సరాల పాటు 21 సెంటర్లలో 280 మోడల్ టెస్టులను నిర్వహించామన్నారు. పోలీస్ కోచింగ్ అంటే ఆంధ్ర ప్రజలు హైదరాబాద్ వెళ్లాలని అనుకునేవారని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో పోలీస్ కావాలంటే హైదరాబాద్ విద్యార్థి కూడా శ్యామ్ ఇనిస్టిట్యూట్‌కి వెళ్లాలనే స్థాయికి వచ్చామన్నారు. మా వద్దకు వచ్చిన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ ఉద్యోగిగా మార్చడం, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టడం, దీంతో పాటు భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే ఏ ఉద్యోగ నోటిఫికేషన్‌కు అయినా పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన కోచింగ్ అందించడమే మా లక్ష్యం అని తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో భాగవత సదనం బృంద సభ్యులు

అన్నవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి శనివారం ఏలూరు జిల్లాకు చెందిన సుమారు 100మంది భాగవత సదనం బృంద సభ్యులు విచ్చేసి విష్ణుసహస్ర నామపఠనం, నామసంకీర్తన, కూచిపూడి నృత్యం తదితర భక్తి బావ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తన్మయత్వంతో వీటిని ఆస్వాదించారు. ఈవో వీర్ల సుబ్బారావు అభినందించి వారికి స్వామి వారి దర్శనం, ఇతర సౌకర్యాలను కల్పించారు.



సత్యదేవుడి సన్నిధికి చేరుకున్న భాగవత సదనం బృంద సభ్యులు

మొండి బకాయిల వసూళ్లకు చర్యలు

మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కాకినాడ అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 2 (ఆంధ్ర జ్యోతి): ఆస్తి పన్ను మొండి బకాయిల్లో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఆస్తులపై కూడా దృష్టి సారించి మొండి బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపాల్టీ, కార్పొరేషన్ అధికారులతో పలు అంశాలపై ఆయన సమీక్షించా రు. ప్రధానంగా రెవెన్యూ వసూళ్లపై కీలక వ్యా ఖ్యలను సురేష్‌కుమార్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఆస్తి పనులు, బకాయిలకు ఇప్పటి నుంచి నోటీసులు జారీ చేసి పనులు వసూలు చేయాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలకు సంబంధించి యాజమాన్యాలు ఎవరూ పన్ను కట్టేందుకు ముందుకు రాని పక్షంలో ఖాళీ స్థలంలో మున్సిపాల్టీ కార్పొరేషన్లు స్వాధ ఋూన బోర్డులను పెట్టిన ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని వాటిలో సామాజిక భవనం లేక పీహెచ్‌సీలు నిర్మాణానికి వినియోగించుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ క్యాంప్ కార్యాలయం నుంచి కమిషనర్ భావన పాల్గొనగా నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్ కేటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, మేనేజర్ సీతారాం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్విచరణ్, టీపీఆర్‌వో శైలజ పాల్గొన్నారు.

గోదావరి ఒడ్డున గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఎటపాక, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నది ఒడ్డు సమీపంలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. గోదావరి నదికి చేపల వేటకు వెళ్లిన కొందరు మత్స్యకారులు మృతదేహం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వయస్సు 48 నుంచి 55 ఏళ్ల మధ్యలో ఉంటుందని పోలీసులు తెలిపారు. గోదావరి వరదకు కొట్టుకువచ్చి దాదాపు వారం రోజుల పైనే కావచ్చని, మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తోందన్నారు. మృతుడి తరపున ఎవరైనా బంధువులు ఉంటే 6304181609 సంప్రదించాలని ఎస్‌ఐ అప్పలరాజు కోరారు.



క్షయను సమూలంగా అంతమొందించాలి

ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని గుల్ల చేస్తున్న క్షయ మహమ్మారిని సమూలంగా అంతమొందించేందుకు ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యత వహించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పిలుపునిచ్చారు. స్థానిక ఆవ రోడ్డులోని వాంబే సముదాయంలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవం, టీబీ బాధితులకు ఆహార బాస్కెట్‌లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్షయ రహిత సమాజం కోసం యువత, మహిళలు, వి ద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలు ముందడుగు వేయాలన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా బాధితులను దత్తత తీసుకోవాలన్నారు. బాలాజీపేట రోడ్డును 87 అడుగుల రోడ్డుగా అభివృద్ధి చేశామన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత,తల్లీబిడ్డ ఆరోగ్యం,పెళ్లి ఈడు, బాల్య వివాహాలు తదితర అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వసుంధర, డాక్టర్లు కోమలి, రవిరామ్ కిరణ్, శ్రీవల్లి, హారిక, వినీత స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పింగళి వెంకయ్య: జేసీ

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అన్నారు. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, ఆంధ్రా కర్ణాటక నాటక పితామహుడు బళ్లారి రాఘవ జయంతిని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ త్రివర్ణ పతాక రూపకల్పనకు ఐదేళ్ల పాటు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల జెండాలపై అధ్యయనం చేశారన్నారు. సుమారు 30 డిజైన్లు సమర్పించగా అందులో పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకం ఎంపికై భారత జాతీయ పతాకంగా ఆమోదించబడిందన్నారు. అలాగే బళ్లారి రాఘవ బ్రిటీష్ పాలన కాలంలోనే తన కళాచాతుర్యంతో ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపిన మహానుభావుడని గుర్తుచేశారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

ధవళేశ్వరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా స్థానిక 10వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీవో టి.కనకవల్లి విచ్చేసి మాట్లాడుతూ తల్లి ముర్రిపాలు బిడ్డకు పట్టడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలన్నారు. బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన నియమాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆదివాసీల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

గోకవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతమైన గంగవరంలో ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని శివరామపట్నంలో ఏపీ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఆదివాసీ సంస్థలు, గిరిజన, ప్రజా సంఘాలు, హక్కుల కార్యకర్తలు, ఆదివాసీ ఉద్యమ శ్రేయోభిలాషులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొనాలన్నారు.

మెనూను తప్పనిసరిగా పాటించాలి: ఎంఈవో

బిక్కవోలు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన మెనూను పాటించాలని మండల విద్యాశాఖాధికారి కె.పూర్ణచంద్రరావు ఉపాధ్యాయులకు సూచించారు. మెళ్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్స్, అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్నభోజనం స్వీకరించారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేసారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.సత్తిరెడ్డి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థికి
రెజ్లింగ్‌లో కాంస్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ థర్డ్ ఇయర్ చదువుతున్న ఐ.వినయ్‌కుమార్ ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో జరిగిన 8వ స్టేట్ అండర్-23 పురుషులు, మహిళల ఇంటర్ డిస్ట్రిక్టు రెజ్లింగ్ చాంపియన్ షిప్-2005లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ నిర్వహించిన ఈ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది రెజ్లర్లు పాల్గొన్నారు. కాంస్య పతకం సాధించిన వినయ్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, ఇన్‌ఛార్జి పీడీ ఎం.ప్రసాద్, క్రీడా అధ్యాపకులు పీవీవీ లక్ష్మి, టి.విజయ్ తదితరులు అభినందించారు.

వెంకటనగరం ఎత్తిపోతల
కాలువకు నీటి విడుదల

రంగంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వెంకటనగరం ఎత్తిపోతల కాలువకు రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం స్విచ్ ఆన్ చేసి అధికారికంగా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటనగరం ఎత్తిపోతల పథకం ద్వారా వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, మండలాధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను, మద్దిపాటి సత్తిబాబు, కూటమి నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరలింకపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా జ్యోత్స్న

గోకవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వీరలింకపల్లిలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల నూతన ప్రిన్సిపాల్‌గా జ్యోష్ణ సుజ్ఞానవల్లి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా చేసిన కేఎంవీ రాణి గత నెలాఖరున పదవీ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో జగ్గంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న జ్యోష్ణ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గోరంట్ల
- రైతులకు చెక్కుల పంపిణీ


కడియంలో రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల, జేసీ

కడియం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం అన్నదాత సుఖీభవ పథకాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుతో కలిసి ఆయన ప్రారంభించారు. రైతులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల, వ్యవసాయ సాగు లో విధానాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి రైతులు చెప్పిన సమస్యలపై స్పందిస్తూ అధి కారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. అన్నదాత సుఖీభవ ద్వారా మొదటి దఫాలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రూ.7 వేలు చొప్పున జమ చేశాయని, ఒక్కో రైతుకు ఏడా దికి రూ.20 వేలు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. రైతులతో కలిసి సీఎం చంద్రబాబు చిత్ర పటానికి ధాన్యాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, బోడపాటి గోపి, మత్యేటి ప్రసాద్, ముద్రగడ జమీ, ఆదిమూలం సాయిబాబా, మరెడ్డి రమేష్, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, నున్న కృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేవీకే.. వెబ్‌క్యాస్ట్‌లో వీక్షించిన రైతులు

రాజానగరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ పథకంలో భాగంగా ప్రధాని మోదీ శనివారం విడుదల చేసిన రూ.20,500 కోట్లు 20వ వాయిదా కార్యక్రమాన్ని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్ట్ ద్వారా రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ రైతుల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2019లో కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం కిసాన్)పథకాన్ని ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు పాల్గొన్నారు.

24473 రైతులకు లబ్ధి: నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో కనీసం సాగునీరందే పరిస్థితి కూడా లేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే సాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా కాలువలను శుభ్రం చేశామన్నారు. కాగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల్లో భాగంగా అనపర్తి నియోజకవర్గంలో 24473 రైతులకు రూ.17 కోట్ల లబ్ధి చేకూరిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు ధాన్యాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, మత్స్యశాఖ జేడీ నిర్మల, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, ఏడీఏ కృష్ణ, దత్తుడు శ్రీను, ఆళ్ల గోవిందు, సర్పంచ్‌లు హేమతులసి, గంగాభవాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

26,227 మంది రైతులకు లబ్ధి: బత్తుల

కోరుకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నియోజకవర్గం స్థాయి కార్యక్రమానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి విచ్చేశారు. ముందుగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలను ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ సందేశాన్ని, సీఎం చంద్రబాబు సందేశాన్ని లైవ్ టెలికాస్ట్‌ను తెరపై వీక్షించారు. అనంతరం జరిగిన రైతు సదస్సులో మాట్లాడుతూ రెండూ పథకాల కింద నియోజకవర్గంలోని మొదటి విడతగా 26,227 మంది రైతుల ఖాతాల్లో రూ.17,83,010 00 నిధులు జమ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు వారు రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్‌తో కలిసి చెక్‌ను విడుదల చేశారు. కోరుకొండ మండలంలో 8,503 మంది రైతులకు రూ.4.71 కోట్లు, సీతానగరంలో 6328 మందికి రూ.3,42,04000, రాజానగరంలో 8,752 మందికి రూ.4.98 కోట్లు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జాజుల రాము, కర్రి లక్ష్మీనరోజ, రొంగల శ్రీనివాస్, నాయకులు అడపా శ్రీనివాస్, అడ్డాల శ్రీనివాస్, బది రెడ్డి దొర, తెలగంశెట్టి దొర, కంటే నాగ కేశవ రావు,అడపా వీరబాబు, తెలగంశెట్టి శ్రీను, బుద్దా బాపూజీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


కోరుకొండలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల, ఆర్డీవో

కూటమి ప్రభుత్వంలోనే
పేదల అభ్యున్నతి: నెహ్రూ

గోకవరం, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోనే పేదల అభ్యున్నతి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఆయన కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలానికి 158 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం మరమ్మతులు పనులు పూర్తి చేసుకున్న మండల పరిషత్ మీటింగ్ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభంచారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండలో బంగారు
వరలక్ష్మి కానుక-3 లక్కీడ్రా

కోరుకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కోరుకొండలో బంగారు వరలక్ష్మి కానుక-3 లక్కీడ్రా కార్యక్రమం శనివారం నిర్వహించారు. వేలాదిగా మహిళలు వచ్చారు. డ్రాలో గెలుపొందిన 104మంది మహిళలకు విశ్వహిందు ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు బంగారు రూపులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నార

ఇళ్లు నిర్మించకపోతే అడ్వాన్స్‌లు తిరిగిచ్చేయండి

హౌసింగ్ డీఈఈ వనమయ్య

బిక్కవోలు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మన ఇల్లు- మన గౌరవం పథకంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోతే ఇచ్చిన అడ్వాన్స్‌లు తిరిగి చెల్లించాలని హౌసింగ్ డీఈఈ వనమయ్య లబ్ధిదారులకు సూచించారు. బలభద్రపురంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని లబ్ధిదారులకు సర్పంచ్ బుంగా రామారావు అధ్యక్షతన హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ వనమయ్య మాట్లాడుతూ గ్రామంలో 204 మందికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.38,30,000 అడ్వాన్స్‌గా ఇచ్చామని, అయితే వీరు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో ఇచ్చిన అడ్వాన్స్‌లు తిరిగి తమకు చెల్లించాలన్నారు. ఈ మేరకు కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులకు నోటీసులు అందజేశారు. మండలం మొత్తం మీద రూ.90.75 లక్షలు అడ్వాన్స్‌లుగా ఇచ్చామని వీరందరికీ నోటీసులు ఇస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వీఎస్. ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో జాన్ మిల్టన్, ఏపీవో అగస్టీన్‌కుమార్, ఎంపీటీసీ చిన్నం వీర్రాఘవరెడ్డి, కూటమి నాయకులు నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యాపురం బ్యాంక్ మాజీ డైరెక్టర్ మాధవ్‌కు సోదర వియోగం



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ముళ్ల మాధవ్‌కు సోదర వియోగం సంభవించింది.మాధవ్ తమ్ము డు ముళ్ల శంకర్ (43) శనివారం గుండెపోటుతో మరణించారు. శంకర్ కోనసీమ జిల్లా రాజోలు బ్రాంచ్ యూనియన్ బ్యాంక్ మేనేజరుగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. శనివారం ఉదయం ఆయన అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందారు.శంకర్ పార్థీవదేహాన్ని రాజమహేంద్రవరంలోని మాధవ్ నివాసానికి తరలించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.

లిక్కర్ కేసును మిథున్ రెడ్డిపై పులిమారు

మాజీ మంత్రి కారుమూరి

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని, ఏమీలేని లిక్కర్ కేసును ఆయనపై పులి మారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు ఆరోపించారు. లిక్కర్ కేసుల్లో అప్పటి ఎక్సైజ్ మంత్రిని అరెస్టు చేశారంటే అర్థముం దని, మిథున్‌కి సంబంధం ఏమిటని వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగితే ప్రిన్సిపల్ సెక్రటరీ దగ్గరి నుంచీ అందరిపైనా విచారణ చేయాలని డా.అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ములాఖత్ ద్వారా వాళ్ల ముగ్గురూ శుక్రవారం కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడారు. అక్రమంగా, దుర్మార్గంగా, హేయంగా మిథున్‌ని అరెస్టు చేశారన్నారు. మొదట్లో రూ.3600 కోట్లన్నారని, తర్వాత రూ.60 కోట్లన్నారని, వాళ్లే ఇప్పుడు రూ.11 కోట్లు అని చెబితే జడ్జి ఫొటో తీసి తీసుకురమన్నారన్నారు. పరిపాలన గాలికొదిలేసి, ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను పక్కదోవ పట్టించడానికి ఇలాంటి అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. రెడ్‌బుక్ సిద్ధాంతం అమలవుతోందన్నారు. ప్రశ్నిస్తానన్న పవన్‌కల్యాణ్ ఎక్కడున్నారో కనబడడం లేదన్నారు. చంద్రబాబు ఏమి చేస్తున్నారో ఆయనకే తెలియడం లేదని, లోకేశ్ ఎంతసేపూ అరెస్టులతోనే ఉన్నారన్నారు. ప్రతిపక్ష నాయకుడు రోడ్డుపైకి వచ్చేలా ప్రభుత్వమే చేసిందన్నారు. మిథున్‌కి సుప్రీం కోర్టు ద్వారా బెయిల్ వస్తుందని పేర్కొన్నారు.

అర్హులందరికీ కొత్త పింఛన్లు: ఎమ్మెల్యే వాసు


డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేసి ఇస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. నగరంలోని 40వ డివిజన్ పరిధిలో మూలగొయ్యి ప్రాంతంలో ఆయన పర్యటించారు. నూతన డ్రైనేజీ, రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యేతో మాట్లాడగా పింఛన్లు, రేషన్‌కార్డుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, కిలపర్తి శ్రీను, బుడ్డిగ రవి, బుడ్డిగ గోపాలకృష్ణ, సింహా నాగమణి, సింహా వెంకటేష్, కొల్లి నాని, దాస్యం ప్రసాద్, ఆడారి లక్ష్మీనారాయణ, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ భవిష్యత్‌కు మార్గదర్శి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వేత్తలు, విద్యావేత్తలు ఆవిష్కర్తలు ఒకే వేదికపై చేరిన నేపథ్యంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ భవిష్యత్‌కు ఓ గొప్ప మార్గదర్శిగా నిలవనున్నదని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కాకినాడ, ఏలూరు, కోనసీమ జిల్లాల పారిశ్రామికవేత్తలతో ఆర్‌టీఐహెచ్ ఆధ్వర్యంలో రెండో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక ఆలోచన కార్యరూపం దాల్చాలంటే ఇటువంటి వేదికలు కీలకం, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మద్దతుతో ముందుకు సాగాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, స్టార్టప్స్ ప్రోత్సాహం, ఆర్టీఐహెచ్ ద్వారా అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, కోర్ టెక్, ఎంఎస్ఎంఈల అభివృద్ధికి విస్తృత అవకాశాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ హబ్‌లో పారిశ్రామిక వేత్తలు ముఖ్యపాత్ర పోషిస్తుండగా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వెనుక నుంచి ఆర్థిక మద్దతు అందిస్తాయన్నారు. పిల్లల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవిష్కరణలకు ఆసక్తిని పెంపొందించేందుకు ఈ వేదిక ఉపయుక్తమవుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ పరస్పర ఆలోచనల సమ్మేళనమే అభివృద్ధికి మూలాధారమని, టాటా ఇన్నోవేషన్ హబ్ ఆ దిశగా కీలకవేదికగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ కోర్ చైర్మన్ జి.రాంబాబు, నన్నయ యూనివర్శిటీ వీసీ వి.ప్రసన్నశ్రీ, ఆదిత్య యూనివర్శిటీ చైర్మన్ శేషారెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా గెయిల్ ప్రతినిధి కేవీఆర్ రావు, ఓఎన్జీసీ ప్రతినిధి కేఏకే రాజు, తాడేపల్లి గూడెం ఎన్ఐటీ ప్రతినిధి రవికిరణ్‌శాస్త్రి, వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్శిటీ ప్రతినిధి శ్రీరామ్, యువ పారిశ్రామిక వేత్తలు వారి ఆలోచనలు పంచుకున్నారు.



శాంతించినది

ధవళేశ్వరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద తగ్గుముఖం పడుతుంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం సాయంత్రానికి 3,28,230 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 5 వేలు, సెంట్రల్ డెల్టాకు 2300, పశ్చిమడెల్టాకు 7 వేల క్యూసెక్కులు చొప్పున నీరు విడుదల చేశారు.

బడులకు.. మంచిరోజులు

- ఇక రాజకీయ జోక్యం చెల్లు
- ఇతర వ్యక్తులకు అనుమతి నిల్
- విద్యార్థులతో ఫొటోలు నిషేధం
- పేరెంట్స్, ఎస్ఎంసీలకు ఓకే
- ఏదైనా హెచ్ఎంకు చెప్పాల్సిందే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)
పాఠశాలలకు మంచిరోజులు వచ్చాయి. పాఠశాలలో రాజకీయ జోక్యాలను నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆహ్వానిస్తున్నారు. ఏదో కారణంతో బయట నుంచి అనేక మంది వ్యక్తులు పాఠశాలల్లోకి ప్రవేశించి గొడవలు పడడం వంటివి జరుగుతున్న సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో విద్యాశాఖ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వి. విజయ రామరాజు ఈ నెల 1న పాఠశాల విద్యా జాయింట్ డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులకు కొన్ని ప్రొసీడింగ్స్ ఇచ్చారు.వాటి ప్రకారం ఇక పాఠశాలలోకి తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు తప్ప అనధికార వ్యక్తులకు పాఠశాల ఆవరణలోకి ప్రవేశం లేదు.హెచ్ఎం అనుమతి లేకుండా ఎవరూ వెళ్లకూడదు. బహుమతులు,విరాళాలు ఇవ్వడానికి అనుమతి తీసుకోవాల్సిందే. పాఠశాలల్లో కొనసాగుతున్న విద్య కార్యకలాపాలకు అంతరాయం కలిగించే పరిస్థితి లేకుండా ఈ ఉత్తర్వులు కట్టడి చేయనున్నాయి. పిల్లలకు ఏదైనా గిఫ్టులు, సామగ్రిని అందజేయాలంటే నేరుగా హెచ్ఎంకు సమర్పించాలి. విద్యార్థితో మాట్లాడకూడదు. తరగతి గదుల్లోకి వెళ్లకూడదు.పిల్లలతో అక్కడ ఫొటోలు తీసుకోవడం నిషేధించారు. ఏ రకమైన ఫిర్యాది అయినా, అభ్యర్థన అయినా అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందికి మాత్రమే అందజేయాలి. ఇతర వ్యక్తులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదు. పాఠశాలల ప్రాంగణంలో రాజకీయ పార్టీలు, సంస్థలకు సంబంధించిన జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు వంటివి, రాజకీయ చిహ్నాలు ప్రదర్శించడాన్ని నిషేధించారు. ఇక విద్యార్థి సంఘాలు ఏదైనా సమస్య ఉంటే నేరుగా హెడ్‌మాస్టర్‌తో మాట్లాడాలి. నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి, విద్యార్థులతో మాట్లాడడం, ఉపన్యాసాలు ఇవ్వడం వంటి వాటికి ఇక అనుమతి ఉండదు. ఈ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేసేలా ఆయా జిల్లాలకు ఆదేశాలందాయి.



టీచర్ల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వ విద్య చతికిలపడుతుందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ప్యాప్టో) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జేడీఐజీ డేనియల్ బాబు, పి.జయకర్ అన్నారు. రాజమహేంద్రవరం(బొమ్మూరు)లోని కలెక్టరేట్ ఎదుట శనివారం ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు.ఇటీవల పాఠశాలల్లో ప్రవేశపెట్టిన విద్యాశక్తి కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరిస్తున్నాయన్నారు.



ఆదివారం ప్రత్యేకం

ఒక ఊరు.. నూరు లాడ్జిలు!

పిఠాపురాన ప్రతి ఇల్లూ వసతిగృహమే

ఆ ఆలయానికి వెళితే వసతికి వెతుక్కోవాల్సిన పనే ఉండదు.. ఆలయం ఎదుట నిలబడి ఎటు చూసినా రూమ్స్ అద్దెకు ఇవ్వబడును అంటూ బోర్డులు దర్శనమిస్తాయి.. ఎందుకంటే అక్కడ ప్రతి ఇల్లూ ఒక అతిథి గృహమే.. ఈ నేపథ్యంలో ఏ ఇంటి తలుపు తట్టినా అతిథిదేవోభవ అంటూ ఆహ్వానిస్తారు.. అదిరే సౌకర్యాలతో ఆతిథ్యం ఇస్తారు.. ఫ్రీగా అనుకునేరు.. అంతా డబ్బులకే.. ఇదెక్కడో కాదండోయ్.. పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభుడి ఆలయం చుట్టూ ఉన్న పరిస్థితి.. ఒక 100 వరకూ లాడ్జిలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో.. ఇక్కడ కాశీ తరహాలో వసతి సదుపాయాలు ఉంటాయి..

- ఏ వీధిలో చూసినా గెస్ట్‌రూమ్‌లు
- లాడ్జిలుగా మారుతున్న నివాసాలు
- ఏ ఇంటికెళ్లినా అద్దెకు రూమ్స్
- శ్రీ పాదుడి ఆలయం వద్ద డిమాండ్
- ఇప్పటికే 100 లాడ్జిలు నిర్వహణ
- నిర్మాణంలో మరో 150
- రోజురోజుకు పెరుగుతున్న భక్తులు
- 1500 మందికి ఉపాధి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)
అక్కడ ప్రతి ఇల్లు ఒక వసతి గృహమే. వీధులు, సందులు ఎక్కడ చూసినా 'రూమ్‌లు అద్దెకు ఇవ్వబడును' అంటూ ఇంగ్లీషు, హిందీ, మరాఠీ భాషల్లో బోర్డులు కనిపిస్తాయి. శ్రీపాదుడి ఆలయానికి చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఇప్పటికే 100కిపైగా లాడ్జిలు ఉన్నాయి. మరో 50 వరకూ నిర్మాణంలో ఉన్నాయి. భక్తులకు గదులు అద్దెకు ఇవ్వడం ద్వారా పలువురు ఉపాధి పొందుతున్నారు.కాశీ తరహాలో ఒక ఆలయం చుట్టూ ఇన్ని వసతి సముదాయాలు ఉన్న పరిస్థితి గోదావరి జిల్లాల్లో ఎక్కడా కానరాదు.

శ్రీపాదశ్రీవల్లభుడి భక్తుల రాక..

మరాఠీలు, ఉత్తరాది రాష్ట్రాలు వారు తమ ఇంటి ఇలవేల్పుగా దత్తాత్రేయస్వామి ప్రథమ అవతారమైన శ్రీపాదశ్రీవల్లభుడిని భావిస్తారు. ఈ మేరకు ఆయన జన్మించిన పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి ఏటా 20 లక్షల మంది భక్తులు వస్తుంటారు. మహారాష్ట్రతో పాటు కర్నాటక, ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఉత్తరాది నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి శ్రీపాద శ్రీవల్లభుడిని దర్శించుకుంటారు. ఏటా గురువారాలు, చిత్తనక్షత్రం వచ్చే రోజులతో పాటు శ్రీపాద శ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు, దత్త జయంతి ఉత్సవాలు, విజయదశమి, ఇతర పర్వదినాల సమయాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.ఈ ఆలయానికి వచ్చే భక్తులు కనిష్ఠంగా మూడు రోజులు, గరిష్ఠంగా తొమ్మిది రోజులు ఉంటారు. కొందరు ఏటా నెల రోజుల పాటు ఉండి శ్రీపాదశ్రీవల్లభ చరిత్ర, గురుచరిత్ర పారాయణ చేసుకుంటారు.

ఇక్కడ కొబ్బరికాయ కొట్టరు..

శ్రీపాదశ్రీవల్లభుడికి కొబ్బరికాయ కొట్టరు. శ్రీపాదుడు కొలువై ఉన్న ఆలయ ప్రాంగణంలోని ఔదంబర వృక్షానికి కొబ్బరికాయలను కట్టి వేలాడతీసి చుట్టూ ప్రదిక్షణలు చేసి కోర్కెలు నెరవేర్చమని వేడుకుంటారు.కోర్కెలు నెరవేరిన తర్వాత మళ్లీ శ్రీపాదశ్రీవల్లభుడిని దర్శించుకుని పూజలు చేస్తారు.

భక్తనివాసాలుగా..

భక్తుల రద్దీ దృష్ట్యా నివాస గృహాలు లాడ్జిలు, భక్తనివాస్‌లు, వసతి సముదాయాలుగా మారిపోయాయి. ఆలయ వసతి సముదాయాల్లో 70 గదులు ఉన్నాయి. ఇవి పూర్తిగా ఉచితమైనా భక్తుల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ఇప్పుడు ఈ క్షేత్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో 100కిపైగా లాడ్జిలు ఉన్నాయి. ఇవి గాక పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 15 వరకూ ఉన్నా పర్వదినాల సమయాల్లో రూమ్‌లు సరిపోని పరిస్థితి. సాధారణ రోజుల్లో 12 గంటలకు రూ.వెయ్యి, 24 గంటలకు రూ.1500 నుంచి రూ.2,500 వరకూ అద్దెగా వసూలు చేస్తున్నారు. పర్వదినాల సమయంలో మాత్రం 12 గంటల ప్రాతిపదికన అద్దె రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకూ ఉంటోంది. భక్తులు వసతిని ఆలయ పరిసరాల్లో ఉన్న గృహాల యజమానులు తమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పలువురు గృహాల యజమానులు వసతి తీసుకునే భక్తులకు ఇష్టమైన ఆహారాన్ని తయారు చేసి అందిస్తున్నారు. ఆహారంతో కలిసి అద్దెలు వసూలు చేస్తారు.

ఇరుకుగా వీధులు..

ఆలయ పరిసరాల్లో రోడ్లు ఇరుగ్గా ఉంటాయి. ఒక కారు వెళ్తే మరో వాహనం వచ్చేందుకు మార్గం ఉండదు. అటువంటి చోట 100కిపైగా లాడ్జిలు, వసతి సముదాయాలను నిర్మించారు. కొన్ని సందుల్లోకి ద్విచక్ర వాహనాలు మినహా ఆటోలు వెళ్లలేవు. కాశీ తరహాలో ఇక్కడ వీధులు కనిపిస్తాయి. అటువంటి వాతావరణం ఉభయ గోదావరి జిల్లాలోని పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం వద్ద కనిపిస్తోంది. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 1500 మందికి పైగా ఉపాధి కలుగుతోందని పలువురు తెలిపారు. ఇక్కడ వసతిగృహాలు, లాడ్జిలకు ఉన్న డిమాండ్‌తో స్థలాల రేట్లు గణనీయంగా పెరిగాయి. ఇక్కడ సెంటు స్థలం ప్రస్తుతం రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ఉంది.కొందరు సినీ ప్రముఖులు ఇక్కడ స్థలాలు కొనుగోలు చేశారు. వారు కొంత పెద్దస్థాయిలో హోటళ్లు నిర్మించాలని భావిస్తున్నట్టు సమాచారం.



భక్తులకు వసతి.. ఎందరికో ఉపాధి



శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి భక్తులు అధికంగా తరలివస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ పరిసరాల్లో గృహ యజమానులు తమ ఇళ్లనే వసతి సముదాయాలుగా మార్చి అద్దెకు ఇస్తున్నారు. భక్తులకు దగ్గరలో వసతి లభిస్తోంది.

-పెనుగొండ కొండలరావు, విశ్రాంత సాంఘిక సంక్షేమ శాఖాధికారి, పిఠాపురం

టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలి



పిఠాపురంను టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తే భక్తులకు మెరుగైన సౌకర్యాలు,వసతి లభిస్తాయి. ప్రభుత్వం పర్యాటకాభివృద్ధిలో భాగంగా హోమ్ స్టే కల్పిస్తున్న గృహ యజమానులను ప్రోత్సాహించాలి. డిప్యూటీ సీఎం పవన్ చొరవ చూపాలి.

- తోట ఏడుకొండలు, విశ్రాంత అర్బన్ బ్యాంకు ఉద్యోగి, పిఠాపురం



కొవ్వూరులో అన్నదాత సుఖీభవ చెక్ అందజేస్తున్న మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే ముప్పిడి, కలెక్టర్

46 లక్షల మందికి అన్నదాత సుఖీభవ

కొవ్వూరులో ప్రారంభించిన మంత్రి నిమ్మల రామానాయుడు

కొవ్వూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 46 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ మొదటి విడత పెట్టుబడి సాయం అందించినట్టు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం నియోజకవర్గ అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ 2025-26 మొదటి విడత నిధుల జమ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయశాఖ నిర్వీర్యమైపోయిందన్నారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆరుగాలం పండించిన ధాన్యం అమ్మకాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సొమ్ములు సకాలంలో చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం రైతులకు బకాయిపడిన ధాన్యం సొమ్ము రూ.1640 కోట్లు చెల్లించిందన్నారు. అంతే కాదు ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతు ఖాతాకు సొమ్ము జమ చేస్తున్నామన్నారు.ప్రజాస్వామ్యంలో జగన్‌లాంటి వ్యక్తులు ఉండడానికి అనర్హులన్నారు. ఎవరైనా చనిపోతే వారం రోజుల్లో పరామర్శకు వెళ్తాం. జగన్‌రెడ్డి సంవత్సరం తరువాత పరామర్శకు వెళ్తారన్నారు. దేశచరిత్రలో బెట్టింగ్ రాయుళ్లకి, గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్‌లకి విగ్రహావిష్కరణ చేసిన ఘనత ఒక జగన్మోహనరెడ్డికే చెల్లిందన్నారు. 2047కి తెలుగుజాతి ప్రపంచంలో అగ్రగామిగా ఉండాలని చంద్రబాబు, పవన్, నరేంద్ర మోదీ కృషిచేస్తుంటే మరోప్రక్కన అడుగడుగునా సమస్యలు సృష్టిస్తున్నారన్నారు.పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు మళ్లీ పట్టాలెక్కించారన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రమ్ వాల్, ప్రాజెక్టు పూర్తిచేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. చాగల్లు మండలంలో ఉన్న ముంపుగ్రామాల సమస్యను పరిష్కరిస్తానన్నారు. రాష్ట్రంలో 1050 ఎత్తిపోతల పథకాలు ఉంటే వాటిలో 540 పథకాలు పనిచేయడం లేదన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చి మరమ్మతులు చేసి నిర్వహించే బాధ్యతలు అప్పగించేలా రైతుల పక్షాన ప్రతిపాదనలు తయారుచేస్తున్నామన్నారు. సుమారు 6 వేల కోట్లతో ప్రతిపాదనలు వచ్చాయన్నారు. మంగళవారం సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుందామని సీఎం చెప్పారన్నారు. మరమ్మతులకు గురై మూతపడిన లిఫ్టులను పునః ప్రారంభిస్తామన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు గురయ్యాయని, గ్రామాలు ముంపుకు గురవుతున్నాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు.జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో మొదటి విడతగా రూ. 7 వేలు జమ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో లక్షా 14 వేల మందికి రూ.79 కోట్లు జమచేశారన్నారు. భూమిలేని కౌలు రైతులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. కౌలు రైతులకు అక్టోబర్, జనవరి నెలల్లో రూ. 20 వేలు జమ చేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు సత్యనారాయణను మార్గదర్శిగా ఎంపిక చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర,ఎంపీపీ కాకర్ల నారాయుడు, అదనపు ఎస్పీ సుబ్బరాజు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, సి.హెచ్.శ్రీనివాసరావు,ఎ.గంగాధర్,సూరపనేని చిన్ని, దాయ న రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే డీఆర్ఎం వచ్చారు..చూశారు!

రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియా శనివారం రైల్వే స్టేషన్లను పరిశీలించారు..ఈ నెల 6 లేదా 7న రైల్వే జీఎం రాక నేపథ్యంలో ముందస్తుగా తనిఖీలు సాగినట్టు తెలిసింది.. - వివరాలు 8లో

రైల్వే ప్రయాణికులకు అభద్రత!

- మందుబాబుల ఆగడాలు
- ఆభరణాలు దోచుకునే యత్నం
- పేలవంగా రక్షణ విధులు
- మరో పక్క డీఆర్ఎం తనిఖీలు



రైల్వే స్టేషన్ ఆవరణలో మందుబాబు

రాజమహేంద్రవరం,ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషను లోపల ఒక వైపు డీఆర్ఎం మోహిత్ సోనాకియా తనిఖీలు చేస్తుండగా.. స్టేషను బయట ఓ మహిళ మెడలో ఆభరణాలు దొంగిలించడానికి ఒక వ్యక్తి ప్రయత్నం చేశాడు. పెద్ద రైల్వే స్టేషన్ లోపలా బయటా నేరాలకు అడ్డాగా మారిందని 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం వెలువరించిన కథనం అక్షర సత్యమని ఈ ఘటన రుజువు చేస్తోంది. రైల్వే స్టేషనులో కోచ్ రెస్టారెంట్ ప్రాంతం, బయట రోడ్డుపై మద్యం పూటుగా తాగిన వ్యక్తులు ప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారు. వారిలో యాచకులు ఉంటున్నారు. వాళ్లను చూస్తేనే భయపడే విధంగా ఉంటున్నారు. వారం కిందట కోచ్ రెస్టారెంట్ ఎదురుగా మూతబడిన ఆహారం రెస్టారెంట్‌లో ఒక యాచకుడిపై దాడి జరిగిన విషయం తెలిసిందే. శుక్రవారం ఒక రైల్వే మహిళా ఉద్యోగి ఇంటికి వెళుతుండగా.. శ్రీరామ్ హోటల్ పక్కన ధ్వంసమైన షాపుల సమీపంలో పట్టపగలు ఆ ఉద్యోగి వెనుకగా వచ్చిన ఒక వ్యక్తి మెడలో ఆభరణాలు దొంగిలించే ప్రయత్నం చేశాడు. ఆమె అప్రమత్తమై ఆగ్రహించగా అతడు పారిపోయాడు. గూడ్స్‌షెడ్ ప్రాంతంలో గంజాయి దొరికిన దాఖలాలు ఉన్నాయి. రోజుకు 35 వేల మంది రాకపోకలు సాగించే రాజమండ్రి రైల్వే స్టేషనులో ప్రయాణికుల భద్రతను లోపల ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్), బయట టూటౌన్ పోలీసులు చూడాల్సిన బాధ్యత ఉంది.కానీ రక్షణ విధులు పేలవంగా మారినట్టు పరిస్థితులు చెబుతున్నాయి.టూటౌన్ పోలీసుల నిఘా లేకపోవడం, అప్పుడప్పుడు మాత్రమే పోలీసులు కనబడడంతో ప్రతి రోజూ పూటుగా మద్యం తాగిన వ్యక్తులు ప్రమాదకరంగా మారారు. ప్రయాణికులను భయపెడుతున్నారు.ఇక, రైల్వేస్టేషను బయట పరిశుభ్రత నిద్దరోయింది. ప్రయాణికులకు దుర్వాసన స్వాగతం పలుకుతోంది.

రెచ్చిపోతోన్న మట్టి మాఫియా

- పోలవరం గట్లు మాయం
- కలవచర్ల గ్రామస్తుల ఆందోళన
- రంగంలోకి దిగిన అధికారులు
- 17 లారీలు..4 ఎక్స్‌కవేటర్లు సీజ్



అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న లారీలను అడ్డుకున్న కలవచర్ల గ్రామస్తులు



కలవచర్లలో అక్రమంగా తవ్వేసిన పోలవరం గట్లను పరిశీలిస్తున్న అధికారులు

రాజానగరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం మండలంలో మట్టి మాఫియా ఆగడాలు జోరుగా సాగుతున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారులు మాఫియా విసిరే కాసులకు కక్కుర్తి పడుతూ కనీసం కన్నెత్తి చూడడం లేదు. రాత్రి పగలు తేడా లేకుండా కాలువ గట్లు, చెరువుల్లో ప్రభుత్వ నిబంధనలను కాలరాస్తూ ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. రాజానగరం మండలం కలవచర్లలో పోలవరం కాలువ గట్టుపై యథేచ్ఛగా అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలు సాగుతున్నాయి. ఈ మేరకు గ్రామస్తులు శుక్రవారం అర్ధరాత్రి అడ్డుకుని సంఘటనా స్థలంలో ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో పోలవరం కాలువ గట్టుపై మట్టి లోడుతో ఉన్న 22 లారీలతో పాటు నాలుగు యంత్రాలను పట్టుకుని రెవెన్యూ, పోలీసులు అధికారులకు అప్పగించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ గ్రామంలో గత ఆరు నెలలుగా పోలవరం కాలువ గట్టుపై అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేస్తూ కోట్లాది రూపాయల అక్రమార్జన సాగిస్తున్నారన్నారు. అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఆందోళనకారులు శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో రాజానగరం తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి కలవచర్ల చేరుకున్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న జేసీబీలు, లారీలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.దీంతో వివిధ శాఖల జిల్లా అధికారులు శనివారం కలవచర్ల చేరుకుని పోలవరం కాలువ గట్లను పరిశీలించారు. మైన్స్ శాఖ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి మాట్లాడుతూ మూడు ప్రదేశాల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరిపినట్టు గుర్తించామన్నారు. అక్రమ మట్టి రవాణా చేస్తున్న 17 టిప్పర్లను అదుపులోకి తీసుకుని రాజానగరం పోలీసులకు అప్పగించామన్నారు. పోలవరం కాలువ గట్టు వెంబడి మూడు ప్రదేశాల్లో తవ్వకాలు జరుపుతున్న నాలుగు ఎస్కవేటర్లను గుర్తించారు. ఇరిగేషన్ సిబ్బంది, మైనింగ్‌శాఖ సర్వేయర్ సహాయంతో అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాల్లో కొలతలు వేశారు. తనిఖీల్లో జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి, ఇరిగేషన్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఇదేమి కాలమో వరుణుడు మరచిపోయినట్టున్నాడు.. భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు.. గతంలో ఎన్నడూ లేనంతగా ఎండలు మండుతున్నాయి.. రాజమండ్రిలో శనివారం కెమెరాకు చిక్కిన ఈ చిత్రాలే అందుకు నిదర్శనం.. ఎండ తాళలేక ఎలా వెళుతున్నారో చూడండి.. - ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కుల పంపిణీ


సమిశ్రగూడెంలో రైతులకు అందిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో మొత్తం 19,368 మంది రైతులకు గాను రూ. 13.7 కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయడం జరిగిందని మండల స్పెషల్ ఆఫీసర్ ఏ.దుర్గేష్ తెలిపారు. శనివారం సమిశ్రగూడెంలో నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలు మండలంలో 7,749 మంది రైతులకు రూ. 5.26 కోట్లు, పెరవలి మండలంలో 7,039 మంది రైతులకు రూ.4.59 కోట్లు, ఉండ్రాజవరం మండలంలో 4,581 మంది రైతులకు రూ. 3.20 కోట్లు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకట రత్నం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవకు అర్హులైన రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ. 20 వేలు అందించడం జరుగుతుందన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతాంగానికి అన్నదాత సుఖీభవ ఒక వరమన్నారు. ఏవో జీ.సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు రాష్ట్రప్రభుత్వం బిందుసేద్యం, విత్తనాలను సబ్సిడీపై అందిస్తుందన్నారు. ఎంపీడీవో జగన్నాథరావు, తహశీల్దార్ నాగరాజునాయక్, అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల కృషి ఎనలేనిది


సచివాలయ ఉద్యోగులను సన్మానించిన దృశ్యం

పెరవలి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధికి సచివాలయ ఉద్యోగులు చేసిన కృషి ఎనలేనిదని కానూరు సర్పంచ్ భావన మధు పూర్ణచంద్ పేర్కొన్నారు. కానూరు సచివాలయంలో పని చేసి బదిలీపై వెళుతున్న ఉద్యోగులకు శనివారం వీడ్కోలు సన్మానాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు తమ పదవీ కాలంలో ప్రజలకు సత్సంధాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రముఖులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో పశుపోషణపై వర్క్‌షాపు



వెంకట రామన్నగూడెంలో జరిగిన వర్క్‌షాపులో పాల్గొన్న చాగల్లు పాడి రైతులు

చాగల్లు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వెంకట రామన్నగూడెంలోని ఉద్యానవన యూనివర్సిటీ ప్రాంగణంలో శనివారం ఆధునిక పద్ధతుల్లో పశుపోషణ అనే అంశంపై వర్క్‌షాపు జరిగింది. దీనికి చాగల్లుకు చెందిన పాడి రైతులు జుట్టు కృష్ణమూర్తి, తోటకూర సూరిబాబు, చెల్లింకుల తేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి అనుభవాలను విలేఖరులకు తెలియజేశారు. పశుపోషణ లాభసాటి కావాలంటే తీసుకోవలసిన చర్యలు, పశువుల ఆరోగ్య పరిరక్షణ, వివిధ రకాల పశుగ్రాసాలు గురించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తెలియజేసినట్టు చెప్పారు. జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ వై.శ్రీనివాస రావు, పండల పశువైద్యాధికారి యు.ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల సంబరాలు


కేకు కట్ చేస్తున్న టీడీపీ నేతలు

నల్లజర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి):అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడంతో పోతవరంలో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు.ఈసందర్భంగా సీఎంకు గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఏలేటి శ్రీనివాసరావు (చక్రి), ఉప సర్పంచ్ జేడీ, నేతలు పసుమర్తి ప్రభాకరరావు, గన్నమనేని వెంకటేశ్వరరావు, మండ శ్రీనివాస్, గంటా కృష్ణారావు, యేసు రాజు, మండ సత్యనారాయణ, అబ్బూరు ప్రసాదరావు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం : ఎమ్మెల్యే


తోగుమ్మిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, కూటమి నేతలు

కొవ్వూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అహర్నిశలు పాటు పడుతున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తోగుమ్మిలో శనివారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది కూటమి పాలనలో అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. కార్యక్రమంలో యుపీఎస్ నారాయణ, సూరపనేని చిన్నివట్టికూటి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

• ఏఎంసీ చైర్మన్ బ్రహ్మరాజు


నల్లజర్లలో రైతులకు చెక్కు నమూనాను అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ బ్రహ్మరాజు


ఇండవల్లిలో ప్రారంభ కార్యక్రమాన్ని టీవీలో తిలకిస్తున్న దృశ్యం

నల్లజర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు అన్నారు. శనివారం నల్లజర్ల సొసైటీ హాల్ నందు రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా వచ్చే నిధుల చెక్కు నమూనాను రైతులకు అందించారు. ఈ సందర్భంగా బ్రహ్మరాజు మాట్లాడుతూ గోపాలపురం నియోజక వర్గంలో 31వేల 722 మంది రైతు కుటుంబాలకు 18 కోట్ల 87 లక్షలు సొమ్ములను వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏవో సోమశేఖర్, ఉద్యాన వన శాఖాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరమని మండల టీడీపీ అధ్యక్షుడు అతికాల రామకృష్ణమ్మ తెలిపారు. శనివారం ఈ పథకం ప్రారంభించిన సందర్భంగా ఖండవల్లి రైతు సేవా కేంద్రంలో రైతులతో కలిసి ఆయన టీవీలో ఈ కార్యక్రమం ప్రారంభ దృశ్యాలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన పథకాలలో అన్నదాత సుఖీభవ కూడా అమలు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 7 వేల 22 మంది రైతులకు 4 కోట్ల 91 లక్షల రూపాయలు ఈ పథకం కింద జమ అయినట్టు చెప్పారు.

దేవరపల్లి: యర్నగూడెం సొసైటీలో శనివారం అన్నదాత సుఖీభవ ప్రారంభ కార్యక్రమాన్ని రైతులు టీవీలో వీక్షించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 6,993 మంది రైతులకు రూ. 6 కోట్ల 16 లక్షల 9 వేలు జమ అయ్యినట్టు మండల వ్యవసాయశాఖాధికారి కే.కమలరాజు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పెనుమత్స సుబ్బరాజు, గద్దే శ్రీనివాస రావు, మండల సుబ్బారావు, యర్నగూడెం సీఈవో మండా పెదబాబు పాల్గొన్నారు.


యర్నగూడెం సొసైటీలో టీవీలో వీక్షిస్తున్న రైతులు

ఉండ్రాజవరం: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు మొదటి విడత ఆర్థిక సహాయాన్ని శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా పాలంగి ప్రాథమిక సొసైటీలో జరిగిన సమావేశంలో సీఎం ప్రారంభించిన ఈ పథకాన్ని టీవీలో అధికారులు, రైతులు తిలకించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఏవో బీ. రాజారావు మాట్లాడుతూ మండలంలో 4564 మంది రైతులకు గాను రూ.319.48 లక్షలు విడుదలయ్యాయన్నారు. ప్రతి రైతుకుటుంబానికి ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సహాయం విడతల వారీగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎమ్. సందీప్, తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో పీఎస్ రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, రైతులు, వ్యవసాయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

ఉండ్రాజవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రులో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ అధికారులు పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గర్భిణులు మంచిపోషకాలు తీసుకోవాలని, బిడ్డ జన్మించిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుకు ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. తర్వాత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలే చిన్నారులకు శ్రేష్టమని పలువురు మాట్లాడుతూ తెలిపారు.

కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు రాణి, కృప, గిరిజ, అనంత, వైద్య సిబ్బంది శివపార్వతి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు శుభవార్త

నిడదవోలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక్క రూపాయికే ఉచిత సిమ్, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లను 30 రోజుల కాల వ్యవధితో కూడిన ఫ్రీడమ్ ప్లాన్ ప్రవేశపెట్టినట్టు జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను శనివారం తెలిపారు.

రైల్వే డీఆర్ఎంకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 2019 నాటి రైళ్ల హాల్టింగ్‌ను పునరుద్ధరించాలని కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు రైల్వే డీఆర్ఎం మోహిత్ సొనాకియాను కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం రాజమహేంద్రవరం విచ్చేసిన ఆయన్ని కలిసి కొవిడ్ సమయంలో నిలుపుదల చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించకపోవడంతో సుమారు 110 గ్రామాల ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు గారపాటి మోహనరావు, విల్సన్‌రాజు, వై.కె.శ్రీనివాస్, ఎస్‌వీఎన్ మూర్తి, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నిడదవోలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని, తద్వారా సైబర్ నేరాలకు గురికాకుండా ఉంటారని ఎస్ఐ బాలాజీ సుందరరావు అన్నారు. శనివారం తాడిమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థినులు తమ మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేయుటకు దరఖాస్తులు

కొవ్వూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ డిపోలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఆన్ కాల్ డ్రైవర్లగా పనిచేయుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తులను డిపో మేనేజర్ కార్యాలయంలో అందించాలని డీఎం పీ.ధనుంజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఫోర్సులో ఉన్న హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాలు దాటరాదన్నారు. 10వ తరగతి చదివి ఉండాలన్నారు. ఆర్‌టీఐ జారీ చేసిన జెన్యూనిటీ సర్టిఫికెట్‌ను జతపరచాలన్నారు.

మొబైల్ వినియోగంతో ఎన్నో అనర్థాలు


బాలికలకు అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

కొవ్వూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మొబైల్ వినియోగంతో ఎన్నో అనర్థాలను తెచ్చుకుంటున్నారని కొవ్వూరు రూరల్ ఏఎస్ఐ గంగాధరరావు అన్నారు. పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు ఆత్మరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా పోలీసులు బాలకుమారి, పద్మ శక్తి యాప్, పోక్సో చట్టం,సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు కలగర లక్ష్మీ, అరుణకుమారి, షేక్ రషీదా, శిరీషారాణి, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం నూతన కమిటీ ఏర్పాటు


నూతనంగా ఎన్నికైన గౌడ సంఘం సభ్యులు

నల్లజర్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రకాశరావుపాలెంలో శనివారం నూతనంగా గౌడ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో గౌరవ అధ్యక్షుడిగా శెనగన సతీష్, అధ్యక్షుడిగా రాసమళ్ల శ్రీను, ఉపాధ్యక్షుడిగా బోల్లా దుర్గాప్రసాద్, కార్యదర్శిగా పిల్లి కనకరాజు, కోశాధికారిగా కొనకళ్ల సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ గౌడ సంఘం ప్రతి రంగంలో ముందుండాలని, గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ఉండ్రాజవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవాడలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో గండి నారాయణమ్మకు చెందిన తాటాకిల్లు పూర్తిగా కాలిపోయింది. నారాయణమ్మ వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ అయ్యి ఈ ప్రమాదం జరిగినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆస్తినష్టం సుమారు రూ. 25 వేలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. బాధితురాలికి ప్రభుత్వం 25 కేజీల బియ్యం, చక్కెర అందజేయగా, ఉపసర్పంచ్ పి. ప్రసాదరాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఇసుకపల్లి ప్రభావతి కలిసి రూ. రెండువేల ఆర్థిక సహాయం అందజేశారు. సంఘటనా స్థలాన్ని వీఆర్వో లక్ష్మీనర్సమ్మ, స్థానిక నాయకులు పి. వీరభద్రరాజు, నాగు, తదితరులు పరిశీలించారు.

మండల ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం


నూతనంగా ఎన్నికైన సభ్యులు

దేవరపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా కే.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా చందన చిన్న, కోశాధికారిగా వై.సునీల్, సహాయ కార్యదర్శిగా కే.సాయికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు కే.రామకృష్ణ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫొటోగ్రాఫర్ల సంఘం కోశాధికారి చిర్రా సూర్య, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ఉండ్రాజవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా ఉండ్రాజవరంలో ఇళ్ల నిర్మాణదారులతో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సహాయాన్ని వినియోగించుకుని నిర్మాణలు చేపట్టాలని సూచించారు. హౌసింగ్ ఏఈ టీ. ఏడుకొండలు, ఎంపీడీవో పీఎస్ రామారావు, టీఏ కాంతారావు, వీఆర్వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించకపోతే అడ్వాన్స్‌లు తిరిగి చెల్లించండి

బిక్కవోలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మన ఇల్లు - మన గౌరవం పథకంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోతే ఇచ్చిన అడ్వాన్స్‌లు తిరిగి చెల్లించాలని హౌసింగ్ డీఈఈ వనమయ్య లబ్ధిదారులకు సూచించారు. బలభద్రపురంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని లబ్ధిదారులకు సర్పంచ్ బుంగా రామారావు అధ్యక్షతన హౌసింగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా వనమయ్య మాట్లాడుతూ గ్రామంలో 204 మందికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ. 38 లక్షల 30వేలు అడ్వాన్స్‌గా ఇచ్చామని, అయితే వీరు నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో ఇచ్చిన అడ్వాన్స్‌లు తిరిగి తమకు చెల్లించాలన్నారు. అడ్వాన్స్‌లు తిరిగి చెల్లించాలంటూ కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులకు నోటీసులు అందజేశారు. మండలం మొత్తం మీద రూ. 90.75 లక్షలు అడ్వాన్స్‌లుగా ఇచ్చామని, వీరందరికీ కూడా నోటీసులు ఇస్తున్నట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పీఎస్ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ జాన్‌మిల్టన్, తదితరులు పాల్గొన్నారు.

పర్వతారోహకుడికి సత్కారం


నిడదవోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నిడదవోలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పర్వతారోహణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్వతారోహకుడు కంచడపు లక్ష్మణ్‌ను సత్కరించడం ఎంతో అభినందనీయమని మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పర్వతారోహణ దినోత్సవం సందర్భంగా పర్వతారోహకుడు కే.లక్ష్మణ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మీసాల శివ రామ హరిప్రసాద్ మాట్లాడుతూ పర్వతారోహణలు చేస్తూ నిడదవోలుకు ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తున్న కంచడపు లక్ష్మణ్ భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అందుకు రోటరీ నుంచి తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్, ట్రెజరర్ గుంటుపల్లి సత్యసాయి, గుంటుపల్లి శ్రీనివాసరావు, పచ్చిపులుసు శ్రీరామారావు, పోలదాసు శ్రీనివాసరావు, నీలం నాగేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలను సంరక్షించాలి



నందమూరులో మొక్కలు నాటుతున్న ఏబీఎన్ కళాశాల విద్యార్థులు

కొవ్వూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.రామ్మోహన్ అన్నారు. కళాశాల ఫౌండేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నందమూరులో శనివారం కళాశాల ఉన్నత భారత్ అభియాన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ పి.శ్రీనివాస్, నాయకులు కంటిపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏబిఎన్ కళాశాల విద్యార్థులు, అవంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమాజ సేవా కార్యక్రమాలను అభినందించారు. విద్యార్థులునాటిన మొక్కలను సంరక్షిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై. రవీంద్ర, యూబీఏ కోఆర్డినేటర్ డా.రమేష్, ఏ.శ్రీనివాస్, కె.రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ పిల్లి మురళీధర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు ఫ్లైవోవర్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు జాతీయ రహదారి అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శనివారం విజయవాడ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దివాన్‌చెరువు ఫ్లైవోవర్‌ను గామన్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు జంక్షన్ నుంచి 3 కిలోమీటర్ల మేర రూ.327 కోట్లతో నిర్మించనున్నారు. ఇప్పటికే ఇక్కడ భూమి సేకరించడంతోపాటు, ఆక్రమణలు, ఇతర దుకాణాలు, ఇళ్లను కూడా తొలగించిన సంగతి తెలిసిందే. అలాగే రాజమండ్రి పరిధిలోని లాలాచెరువు, ఐటీసీ జంక్షన్, వేమగిరి జంక్షన్లను రూ.232 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ అండర్ పాసులు కూడా నిర్మించనున్నారు. విస్తరిస్తున్న చారిత్రిక రాజమహేంద్రవరం నగరానికి ఈ పనులు మరింత సౌకర్యాన్ని కల్పించనున్నాయి.

పుష్కరాలపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ పంపండి

రైల్వే డీఆర్ఎం మోహిత్ సోనాకియా


రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం మోహిత్

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్ రైల్వే మేనేజరు మోహిత్ సోనాకియా శుక్రవారం రాజమండ్రి, గోదావరి రైల్వే స్టేషన్లలో కలియదిరిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ ప్రాంతాలను పరిశీలించారు.2027లో జరిగే పుష్కరాల నేపథ్యంలో ఆయన పర్యటన సాగింది. యాత్రికులకు సౌకర్యాలు కల్పించడానికి అవకాశం ఉన్న ఖాళీ ప్రదేశాలను చూశారు. గూడ్స్‌షెడ్, ఆర్పీఎఫ్ బ్యారెక్, ఎలక్ట్రికల్ రూంలు తదితర నిర్మాణాలను తొలగించడం, ఎఫ్‌ఓబీలతోసహా కొత్త నిర్మాణాలను ఎక్కడ చేయాలో సవివరంగా నివేదిక తయారు చేసి అందజేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. యాత్రికులు వచ్చిన వెంటనే స్టేషనులో ఎక్కడికి చేరుకోవాలో స్పష్టంగా నిర్దేశాలు ఉండాలన్నారు. అక్కడ అన్ని సదుపాయాలనూ కల్పించాల్సి ఉంటుందన్నారు. గోదావరి రైల్వేస్టేషను పరిశీలించి బ్రిడ్జి వైపు ప్లాట్‌ఫాం పొడవు పెంచడానికి ఉన్న అవకాశాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. భద్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో సమన్వయం చేసుకొని రైల్వే చేయాల్సిన ఏర్పాట్లపై వివరంగా రిపోర్టును పంపాలని ఆర్పీఎఫ్‌ని ఆదేశించారు. తొలుతగా వీఐపీ లాంజ్‌లో అధికారులతో సమావేశమై మ్యాప్‌ను పరిశీలించి.. వారితో చర్చించారు. ఈ నెల 6 లేదా 7న దక్షిణ మధ్య రైల్వే జీఎం రాజమండ్రి రానున్న సందర్భంగా రైల్వే స్టేషన్లను డీఆర్ఎం నిశితంగా పరిశీలించారు.కార్యక్రమంలో సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ వరుణ్‌బాబు, సీనియర్ డీఈఎన్ నార్త్ గౌతమ్, సీనియర్ డీఓఎం నరేంద్రవర్మ,సీనియర్ డీసీఎం ప్రశాంత్‌కుమార్, ఏడీఈఎన్ ముత్యాలరావు, ఎస్ఎంఆర్ రంగనాథ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి : ఎంఈవో

బిక్కవోలు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన మెనూను పాటించాలని మండల విద్యాశాఖాధికారి కె. పూర్ణచంద్రరావు ఉపాధ్యాయులకు సూచించారు. మెళ్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్స్ అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు.

నన్నయలో 21, 22 తేదీల్లో జాతీయ సదస్సు

• బ్రోచర్ ఆవిష్కరణలో వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 21, 22 తేదీల్లో గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను విశ్వవిద్యాలయంలో శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నన్నయ వర్సిటీ విద్యాకళాశాల ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్, ఎన్‌సీఎస్‌టీ ఆర్థిక సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా గిరిజన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సంస్కృతి, ఆదివాసి సంపద, గిరిజనహక్కులు, విద్య, వైద్యం, గిరిజన మహిళల విద్యఆవశ్యకత మొదలైన అంశాలు చర్చిస్తారని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, సామాజికప్రముఖులు, గిరిజన సలహాదారులు, పరిశోధకులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను, అభిప్రాయాలను పంచుకుంటారని చెప్పారు.

వినియోగదారుడు అంగీకరిస్తేనే స్మార్ట్‌మీటర్

- బలవంతంగా వేయడం లేదు
- తూర్పులో 44,646 అమర్చాం
- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు వినియోగదారులకు బలవంతంగా వేయడంలేదని, వారు అంగీకరిస్తేనే అమర్చుతున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్వాన్స్ ప్లానింగ్ సిస్టమ్ స్మార్ట్ మీటర్ ద్వారా సాధ్యమౌతుందన్నారు. పూర్వం ఎలక్ట్రోమేకానిక్ మీటర్లు ఉండేవని రీడింగ్ తీసుకుని బిల్లులు అటుపై తీసుకువచ్చి ఇచ్చేవారని, అటుపై ఎలక్ట్రానిక్ మీటర్లు వచ్చాయి. కొంతకాలం రీడింగ్ తీసుకుని బిల్లును ఇచ్చేవారని అందులోనే క్యూఆర్ కోడ్ మీటర్లు ప్రవేశించాయన్నారు. స్కాన్ చేసి కరెంట్ బిల్లును జనరేట్ చేసే విధానం వచ్చిందన్నారు. ఇప్పుడు తాజాగా వచ్చిన స్మార్ట్ మీటర్ వల్ల అడ్వాన్స్ ప్లానింగ్ చేసుకోవచ్చన్నారు. వినియోగదారుడి అండ్రాయిడ్ మొబైల్‌లోనే తాను వినియోగిస్తున్న విద్యుత్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు సాంకేతికతను అంగీకరిస్తే మార్పు సాధ్యమై అభివృద్ధి సాధించవచ్చన్నారు. బిల్లు చెల్లింపులు సులభతరం అవుతుందన్నారు. ఇందులో రీచార్జిబుల్ అనేది వినియోగదారుడు ఇష్టాన్ని బట్టి ఉంటుందని కాని కచ్చితం కాదన్నారు.స్మార్ట్ మీటర్ విషయంలో ఎటువంటి అపోహాలు పెట్టుకోవద్దని చెప్పారు.జిల్లాలో ఇప్పటివరకు 44,646 స్మార్ట్ మీటర్లును అమర్చామని, ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి సామ్యూల్, ఏ రాజశేఖర్, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.